# ఇయ్యాల తెలంగాణ
IYYALATELANGANA
మన భాష – మన యాస
iyyalatelangana.com facebook.com/iyyalatelangana twitter.com/iyyalatelangana printerest./iyyalatelangana
హైదరాబాద్ బుధవారం 18-03-2026 సంపుటి :10 సంచిక :250 పేజీలు 8 వెల. రూ॥ 4 /-


# తెలంగాణ అసెంబ్లీలో మాటల యుద్ధం

హైదరాబాద్, మార్చి 17: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'పెన్షన్ పెంచనందుకు ధన్యవాదాలు చెప్పాలా? నిరుద్యోగ భృతి ఇవ్వనందుకు ధన్యవాదాలు చెప్పాలా.. ఉద్యోగులను మోసం చేసినందుకు ధన్యవాదాలు చెప్పాలా. ఎందుకు ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలి' అని కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రులు కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. 'రేషన్ కార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి. యంగ్ ఇండియా స్కూల్ కట్టినందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి' అని అన్నారు. కేటీఆర్ ఓపికగా ఉండాలని మంత్రి హితవుపలికారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిందని.. వాటికి తాము వడ్డీ కడుతున్నామని.. అందుకు ధన్యవాదాలు చెప్పాలంటూ కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీటైన జవాబిచ్చారు.గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పకుండా ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. కోటి ఆరు లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందరికీ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. రూ.22,500 కోట్లతో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు.రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'మీలా మేము ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఇవ్వకుండా వదల్లేదు. మూడు ఎకరాలు ఇస్తామని ఇవ్వకుండా వదిలేయలేదు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేయలేదు. మీరు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కడుతూనే ఈ పనులన్నీ చేస్తున్నాం' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.సీఎం తొలి సంతకం పెట్టిన ఫైలుకే దిక్కులేదని, ఇంకా ఈ ప్రభుత్వం మాటలు ఎవరు నమ్ముతారని కేటీఆర్ విమర్శించారు. 'మహాలక్ష్మి పథకం కింద ప్రతి కుటుంబానికి రెండున్నర లక్షలు ఇస్తామన్నారు.. ఇచ్చారా' అని ప్రశ్నించారు. ఈ రెండున్నర సంవత్సరాలు ప్రజలకు పరిహాస నామ సంవత్సరంగానే మిగిలిందని ఎద్దేవా చేశారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు అన్నట్లుగా రెండేళ్ల పాలన సాగిందన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కోటీ 85 లక్షల దరఖాస్తులు పెట్టుకున్నారని.. ఎక్కడికి పోయాయి ఆ దరఖాస్తులు అని ప్రశ్నిస్తూ.. గల్లంతయ్యాయా అంటూ కేటీఆర్ నిలదీశారు. టీ 20 మాదిరిగా 420 పోటీలు పెడితే ఈ ప్రభుత్వమే గెలుస్తుందంటూ మాజీ మంత్రి సెటైర్ విసిరారు. సీఎం తీరు ఎన్నికల



ముందు దానకర్ణ.. ఆ తర్వాత కుంభకర్ణలా మారిందన్నారు. అట్టర్ ఫ్లాప్ ప్రభుత్వం సంబరాలు చేసుకుంటోందని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారంటూ విమర్శించారు. ప్రధానమంత్రి దగ్గరకు కేటీఆర్ ఎన్నిసార్లు వెళ్లారో లెక్క తీయాలన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళతామని.. ప్రధానిని మంత్రులను కలుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్‌లా తాము ఢిల్లీకి వెళ్లడం లేదని అన్నారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో ఫ్లాప్ అయింది బీఆర్ఎస్ అంటూ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.మంత్రి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ.. 'మీరు ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా మాకు అభ్యంతరం లేదు. మీరు ఢిల్లీకి పోతే నిధులు తెస్తారని అనుకున్నాం. కానీ మీరు ఢిల్లీకి వెళ్లి నిధులు ఇచ్చేసి వస్తున్నారు. రూ.3.60 లక్షల కోట్ల ఐటీ ఎక్స్‌పోర్ట్స్ అని మంత్రి బయట చెప్పారు.

## ఫిరాయింపులపై కెటీఆర్ ప్రస్తావన

### తీర్పు చదవకుండా వ్యాఖ్యలు సరికాదన్న స్పీకర్
### స్పీకర్‌ను తప్పుపడతారా అంటూ పొంగులేటి ఫైర్

హైదరాబాద్,మార్చి17:పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీలో మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్ పై స్పీకర్ తీర్పును కేటీఆర్ ప్రస్తావించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే దానం కాంగ్రెస్ బీ ఫామ్ పై ఎంపీగా పోటీ చేశారని అన్నారు. దానం పార్టీ మారినట్లు ఆధారలు లేవని స్పీకర్ తీర్పు చెప్పడాన్ని తప్పుబట్టారు. అయితే కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన స్పీకర్.. కేటీఆర్ జడ్జిమెంట్ మొత్తం చదవకుండా మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. తనపై విమర్శలు చేసిన ప్రతీ సారి మీడియా ముందుకు వచ్చి సమాధానం చెప్పాల్సిన అవసరం



లేదన్నారు. ఉన్నత పదవిలో ఉన్న తనను అవమానించడం కరెక్ట్ కాదన్నారు. పార్టీ ఫిరాయింపులపై జడ్జిమెంట్ కాపీ పూర్తిగా చదివి మాట్లాడాలని కేటీఆర్ కు సూచించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్ నే ప్రశ్నించడం కరెక్ట్ కాదన్నారు. బీఆర్ఎస్ నిజాయితీగా ఉంటే ఎందుకు ఎన్నికల్లో ఓడిపోతుందని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని ఫైర్ అయ్యారు. అధికారంలో ఉన్నపుడు ఒకలా..ప్రతిపక్షంలో ఉన్నపుడు మరో విధంగా మాట్లాడటం కేటీఆర్ కే చెల్లుతుందన్నారు. కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా కౌంటర్ ఇచ్చారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. పార్టీ ఫిరాయింపుల గురించి మీ నాన్నను అడగాలంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## కెటీఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు

### గత ప్రభుత్వ పాపాలను మరచి మాట్లాడొద్దు
### ఏమేం చేశామో లెక్కలతో సహా వివరిస్తామన్న భట్టి



హైదరాబాద్,మార్చి17(:గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ మాట్లాడుతున్నంత సేపు మంత్రులు పలు అంశాల్లో తిప్పి కొట్టారు. గత హయాంలో చేసిన తప్పులు మరచి, ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. చేస్తున్న అభివృద్ధిని అభినందించి, తగిన సూచనలు చేస్తే మంచిదని అన్నారు. కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. 'పదేళ్లు అధికారంలో ఉండి మహిళా సాధికారతను గాలికి వదిలేశారు. మీ ఇంటి ఆడబిడ్డపై మీకు ఏ గౌరవం ఉందో రాష్ట్రమంతా చూస్తోంది. కానీ రాష్ట్ర మహిళల గౌరవంపై చిన్న చూపు వద్దు. రాష్ట్రాన్ని అభాసుపాలు చేయాలనే ఆలోచన మంచిది కాదని భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని బీఆర్ఎస్ ఆరోపించడం సరికాదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ది చేకూరుతుందనేది లెక్కలతో చెబుతామని తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. అర్హులైన 53 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని వివరించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పకుండా ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందరికీ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. రూ.22,500 కోట్లతో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేశామని డిప్యూటీ సీఎం తెలిపారు.

## రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళతాం

### అభివృద్ధి ఎజెండాగా మా ప్రయాణం
### జాతీయ పార్టీగా ఢిల్లీకి వెళుతూనే ఉంటాం
### కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్,మార్చి17(: కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. ఈ విషయాన్ని కేటీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. టెక్నికల్‌గా మాట్లాడితే బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా రుణం ఇవ్వలేదన్నారు. మహిళలంటే ఎందుకు చులకన అని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మహిళా సాధికారతపై కేటీఆర్ హేళనగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'మీరు పావలా వడ్డీ ఇవ్వలేదు.. మేము ఇస్తున్నాం. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్‌ను మించిన వారు ఈ ప్రపంచంలోనే ఎవరూ లేరు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఎక్కడ ఉండేవారు. ఈరోజు కాంగ్రెస్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు' అంటూ కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంలో ఎంవోయూ, పెట్టుబడులపై ఆయన వివరణ ఇచ్చారు. సిఎం పదేపదే ఢిల్లీకి వెళుతున్నారని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తిప్పికొట్టారు. కేంద్రంతో కొట్లాడి అయినా నిధులు తెచ్చి, రాష్ట్రాన్ని బాగు చేస్తామని అన్నారు. ప్రధాన మంత్రిని కలవడంలో తప్పేముందని అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇస్తారని ఆశించామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని.. దిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తున్నామన్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎన్నోసార్లు దిల్లీకి చక్కర్లు కొట్టారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారంటూ విమర్శించారు. ప్రధానమంత్రి దగ్గరకు కేటీఆర్ ఎన్నిసార్లు వెళ్లారో లెక్క తీయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసా÷–లంల్గ÷నా ఢిల్లీకి వెళతామని.. ప్రధానిని మంత్రులను కలుస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం ఉండాలి..

### కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

న్యూ ఢిల్లీ, పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు తాజాగా సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది.తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది. మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది.పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది.

IYYALATELANGANA
ఇయ్యాల తెలంగాణ
మన భాష – మన యాస

# సంపాదకీయం

## పెట్రోల్, డీజిల్, ఎరువులపై యుద్ధ ప్రభావం

యుద్ధాల్లో స్పష్టమైన విజేతలు ఉండటం చాలా అరుదు. సామాన్య ప్రజలే తరచూ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది.ప్రపంచ ఇంధన మార్కెట్లు, సరఫరా గొలుసులు అస్తవ్యస్థంగా మారడంతో, కొన్ని దేశాలు తీవ్ర ఆర్థిక పర్యవసనాలను ఎదుర్కోవాల్సి వస్తోంది.అయితే ఇంతటి అనిశ్చితిలోనూ కొన్ని దేశాలు సరికొత్త వ్యూహాత్మక అవకాశాల కోసం చూస్తున్నాయి.ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆ ప్రాంతంలో ప్రతికూల పరిణామాలను కలిగిస్తోంది.గల్ఫ్ దేశాలను అస్థిరపరిచింది. మధ్య ప్రాచ్యంలోని వేలాది మంది ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తమ ఇళ్లను విడిచి బయటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.చమురు ధరల పెరుగుదల, గల్ఫ్‌లో హార్మూజ్ జలసంధి వద్ద సముద్ర రవాణాకు కలుగుతున్న అంతరాయం వ్యాపారులకు, వినియోగదారులకు మరింత ఖర్చును పెంచుతోంది.ఇరాన్ రష్యాకు కీలకమైన మిత్రదేశం. అత్యంత ముఖ్యమైన సైనిక భాగస్వామి. సిరియాలో బషర్ అల్–అసద్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడం, వెనెజ్వెలాలో నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన తర్వాత.. మాస్కోకు దౌత్యపరంగా ఎదురైన మరో ఎదురుదెబ్బ ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో మరణించడం.అయితే, మధ్య ప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభం యుక్రెయిన్‌తో రష్యా తలపడుతోన్న యుద్ధానికి ప్రయోజనకరంగా మారవచ్చు. ఎందుకంటే, అమెరికా తన సైనిక బలగాలను మధ్య ప్రాచ్య సంక్షోభం వైపు మళ్లించవచ్చు." పేట్రియాట్ క్షిపణులు, ఇంటర్‌సెప్టార్లు తగ్గిపోవడం రష్యాకు ప్రయోజనకరంగా మారుతుంది. దీనివల్ల యుక్రెయిన్‌కు అందే ఆయుధాల సంఖ్య తగ్గిపోతుంది" అని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్‌కు చెందిన పారిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ స్టడీస్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ నికోల్ గ్రాజేవ్‌స్కీ పర్షియన్‌కు చెప్పారు.తెహ్రాన్‌కు షాహెద్ డ్రోన్ల అవసరం పెరిగినందువల్ల యుక్రెయిన్‌లో మాస్కో సామర్థ్యాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపకపోవచ్చని నిపుణులు అంటున్నారు."యుక్రెయిన్‌తో యుద్ధం మొదలైనప్పుడు ఒక నిర్దిష్ట కాలం పాటు రక్షణ సహకారాల్లో భాగంగా రష్యా ఇరాన్‌పై ఆధారపడింది. అప్పుడు ఇరాన్ షాహెద్ డ్రోన్లను అందించింది. ముఖ్యంగా 2022–23ల్లో వీటి ప్రొడక్షన్ టెక్నాలజీని, ఈ డ్రోన్ల లైసెన్స్‌లను రష్యాకు అందించింది" అని అమెరికాలోని సెంటర్ ఫర్ నాన్–ప్రొలిఫరేషన్ స్టడీస్‌కు చెందిన యురేసియా డైరెక్టర్ హన్నా నోట్ తెలిపారు.'ఇప్పుడు యుక్రెయిన్‌లో యుద్ధం కొనసాగించడానికి రష్యాకు ఇరాన్ మద్దతు అవసరం లేని దశలో ఉంది. రష్యా సొంతంగా షాహెద్ డ్రోన్లను ఉత్పత్తి చేసుకోగలదు" అని తెలిపారు.ఇదే సమయంలో చమురు, గ్యాస్ సరఫరాలకు అత్యంత కీలక మార్గమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో చమురు ధరలు పెరిగాయి. ఇది యుక్రెయిన్ యుద్ధంతో తీవ్ర ఒత్తిడికి గురైన రష్యాకు కొంత ఆర్థిక ఉపశమనం కలిగిస్తుంది.రష్యా బడ్జెట్ ఎక్కువగా ఆ దేశ చమురు ఎగుమతులపైనే ఆధారపడింది. అప్పట్లో బ్యారల్ చమురు ధర 59 డాలర్లు ఉండేది. ప్రస్తుతం ముడి చమురు ధర గణనీయంగా పెరిగింది. ఒకానొక సమయంలో బ్యారల్ సుమారు 120 డాలర్లకు ఎగిసింది.గల్ఫ్‌లోని ప్రముఖ చమురు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గించడంతో.. ప్రస్తుతం చైనా, భారత్ వంటి ముఖ్యమైన మార్కెట్లకు రష్యా మరింత ఎక్కువగా ఎగుమతి చేసే అవకాశం ఉంది."గతంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకుండా అమెరికా భారత్‌ను అడ్డుకుంది. కానీ, ప్రస్తుతం సంక్షోభంతో భారత్‌కు కాస్త ఉపశమనాన్ని కల్పిస్తూ.. మళ్లీ రష్యా చమురు కొనుగోలుకు అనుమతిచ్చింది. కనీసం వచ్చే నెల వరకు ఈ కొనుగోళ్లు కొనసాగవచ్చు ' అని గ్లోబల్ ఎనర్జీ, కమోడిటీ మార్కెట్ ఇంటెలిజెన్స్ కంపెనీ ఆర్గస్ చీఫ్ ఎకనామిస్ట్ డేవిడ్ ఫైఫె చెప్పారు.ఈ సమస్యల నుంచి కొంత బయటపడేందుకు రష్యా చమురుపై ఆంక్షలను సడలించాలని ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి.ఇరాన్ యుద్ధం వల్ల చైనాపై పడే ప్రభావం ఏ మేర ఉంటుందో ఇంకా చూడాల్సి ఉంది.చైనా ముడిచమురు దిగుమతుల్లో కేవలం 12 శాతం మాత్రమే ఇరాన్ నుంచి వస్తుందని సెంటర్ ఆన్ గ్లోబల్ ఎనర్జీ పాలసీ తెలిపింది.పైగా, చైనాలో కొన్ని నెలలకు సరిపడా చమురు సరఫరాలున్నాయి. ఆ తర్వాత తేలికగా రష్యా సాయాన్ని కూడా చైనా కోరుతుండొచ్చు.అయితే యుద్ధం వల్ల, చైనా "ఎగుమతుల ఆధారిత పరిశ్రమల రంగం" ప్రభావితం చెందవచ్చని ఫైఫె తెలిపారు.ప్రాపర్టీ ధరలు పడిపోవడం, దేశీయ వ్యయం తగ్గిపోవడంతో సతమతమవుతున్న చైనా ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా పనిచేసేది, ఆ దేశ జీడీపీలో 20శాతం వాటా ఉన్న ఎగుమతులే.హార్మూజ్ జలసంధిలో సముద్ర రవాణాకు నెలకొన్న అంతరాయం చైనాకు అంత పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ, చైనా ఉత్పత్తులు పశ్చిమానికి వెళ్లేందుకు అట్లాంటిక్ చేరుకోవడం క్లిష్టంగా మారవచ్చు.మరోవైపు, ఆసియా, యూరప్, ఆఫ్రికాలను కలిపే అరేబియన్ ద్వీపకల్పంలోని బాబ్ ఎల్–మాండెబ్ జలసంధిలో కూడా ఇరాన్ అండదండలున్న హౌతీలు దాడులు చేస్తున్నారు." ఇరాన్‌పై యుద్ధంలో చైనాకు దౌత్య అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అమెరికాకు సమతూకంగా తనను తాను నిలబెట్టుకునేందుకు ఇది ప్రయత్నిస్తుంది" అని యూకే రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఫిలిప్ షెట్లర్ జోన్స్ చెప్పారు.మధ్య ప్రాచ్యంలోని చమురు, గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడ్డ ఆగ్నేయాసియా దేశాలు ఈ యుద్ధంతో ఎక్కువగా ప్రభావితమవుతాయి.కొన్ని ఇప్పటికే కఠినమైన చర్యలు తీసుకోవడం ప్రారంభించాయి. వీలైనంత త్వరగా ఆర్థిక ప్రభావాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నాయి.వియత్నాంలో ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి డీజిల్ ధర 60 శాతం పెరిగింది. వీలైతే ప్రతి ఒక్కరూ ఇళ్ల నుంచే పనిచేయాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది.మధ్య ప్రాచ్యం నుంచి ముడిచమురు దిగుమతులపైనే 95 శాతం ఆధారపడ్డ ఫిలిప్పీన్స్‌లో ఎమర్జెన్సీ సేవల్లో పనిచేసే వారు మినహాయించి ప్రభుత్వ రంగ ఉద్యోగులు ప్రస్తుతం వారానికి నాలుగు రోజులే పనిచేస్తున్నారు.పాకిస్తాన్‌లో కూడా ఇదే రకమైన ఆంక్షలను ప్రవేశపెట్టారు. వీలైనప్పుడల్లా వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలను జారీ చేస్తున్నారు. యూనివర్సిటీ తరగతులన్నీ ఆన్‌లైన్‌లోకి మారాయి.యుద్ధభయంతో భారీ కొనుగోళ్ల కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇబ్బంది పడుతోంది. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. దీంతో, కార్లకు రోజుకు 10 లీటర్లు, మోటార్‌సైకిళ్లకు కేవలం రెండు లీటర్లు మాత్రమే ఇచ్చేలా పలు నిర్ణయాలను ప్రకటించింది.కానీ, యుద్ధం పర్యవసనాలు ఇంధన కొరతలకు మించి ఉండనున్నాయి.ప్రపంచవ్యాప్తంగా రైతులు తమ పంటల కోసం ఎరువులపై ఆధారపడ్డారు.

# సువేంద్ర అక్కడి నుంచే పోటీ...

కోల్ కత్తా, మార్చి 17,(న్యూస్ పల్స్) అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి బరిలో నిలిచిన పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. తన మాజీ అనుచరుడు, బీజేపీ నేత సువేందు అధికారి చేతిలో ఓటమి పాలయ్యారు. ఈసారి కూడా దీదీని సువేందు ఢీకొట్టబోతున్నారు. బెంగాల్ ఎన్నికలకు 144 మంది అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ సోమవారం విడుదల చేయగా... ప్రస్తుతం మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భవానీపూర్ నుంచి తమ అభ్యర్థిగా ప్రతిపక్ష నేత సువేందును ప్రకటించింది. నందిగ్రామ్ నుంచి కూడా సువేంద్ పోటీ చేయనున్నారు. అయితే, దీదీ ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది ఇంకా స్పష్టత లేదు. కానీ, భవానీపూర్ నుంచే మళ్లీ బరిలోకి దిగుతారనే ప్రచారం జరుగుతోంది. వరుసగా ఇదే నియోజకవర్గానికి మమతా మూడుసార్లు విజయం సాధించారు. పశ్చిమ్ బెంగాల్‌లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలుకొట్టి 2011లో మమతా బెనర్జీ అధికారంలోకి రావడంలో 'నందిగ్రామ్' కీలక పాత్ర పోషించింది. నాటి కమ్యూనిస్ట్ ప్రభుత్వ చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా మమతా నాయకత్వంలో టీఎంసీ చేపట్టిన ఉద్యమంలో సువేందు అధికారి ఆమెకు తోడుగా ఉన్నారు. తర్వాత అక్కడ నుంచే అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కానీ 2021లో మమతా బెనర్జీపై ఆయననే బీజేపీ ఆయుధంగా ప్రయోగించింది. పోరాటంలో ఎప్పుడూ వెనక్కి తగ్గని దీదీ.. నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ సీటులో 1956 ఓట్ల తేడాతో సువేందు గెలిచి, పైచేయి సాధించారు. నందిగ్రామ్ అధికారికి అండగా నిలుస్తోందన్న విషయం.. ఆ మరుసటి ఏడాది జరిగిన సహకార సంస్థ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో స్పష్టమైంది.అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా తృణమూల్ కాంగ్రెస్ గెలిచి హ్యాట్రిక్ కొట్టినా.. నందిగ్రామ్‌లో దీదీన ఓటమి ఎదుర్కొన్నారు. దీంతో తన సొంత నియోజకవర్గం భవానీపూర్ నుంచి మళ్లీ పోటీచేసి 50 వేలకుపైగా ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.గత ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి పేరుకు ముందు 'మాజీ' అనే పదాన్ని చేర్చాలని తాను కోరుకుంటున్నట్లు ప్రకటించిన అధికారి.. ఈసారి కూడా తాను పోటీచేయబోయే సీటు ఎంపిక ద్వారా ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారు. "నందిగ్రామ్‌లో నేను ఆమెను ఓడించాను.. ఈసారి భవానీపూర్‌లో కూడా ఆమెను ఓడిస్తాను... 50,000 ఓట్ల తేడాతో ఆమెను మాజీ ముఖ్యమంత్రిగా మారుస్తాను" అని అధికారి పలు సందర్భాల్లో శపథం చేశారు.కాగా, ఇటీవల బెంగాల్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భారీగా ఓటర్లను తొలగించారు.

దీదీ కంచుకోట అయిన భవానీపూర్.. రాష్ట్రంలో అత్యధికంగా ఓటర్లను తొలగించిన నియోజవర్గాల్లో ఒకటి. ఈసీ గతవారం విడుదల చేసిన డేటా ప్రకారం నందిగ్రామ్ కంటే నాలుగు రెట్లు ఇక్కడ ఓట్లు తొలగించారు. భవానీపూర్‌లో మొత్తం 2,06,295 ఓట్లు ఉండగా 44,787 ఓట్లు... నందిగ్రామ్‌లో 2,78,211 ఓట్లు ఉండగా 10,599 ఓట్లను తొలగించారు. బెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.

# మూసీ ప్రక్షాళన...



### రంగంలోకి నాలుగో కృష్ణుడు

హైదరాబాద్, మార్చి 17, (న్యూస్ పల్స్) హైదరాబాద్ నగరంలో మూసీ నదికి ఒక విచిత్రమైన చరిత్ర ఉంది. అదెలాగంటే.. ప్రతి ఎన్నికలకు ముందు మూసీ నది 'లండన్ థేమ్స్'లా మారిపోతుంది.. ఎన్నికలు అయిపోయాక మళ్ళీ యధావిధిగా 'మురికి కూపం'గా ప్రమోషన్ పొందుతుంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి గారి వంతు వచ్చింది. బాపూఘాట్ దగ్గర ఏకంగా గాంధీజీ విగ్రహాన్ని పెట్టేసి, మూసీని 'గాంధీ సరోవరం'గా మార్చేయాలని ప్లాన్ చేశారు. వింటేనే భలే ఉంది కదూ!కానీ అసలు సమస్య అంతా ఇక్కడే ఉంది. నదిని బాగు చేద్దామని రేవంత్ పీపీటీ ప్రెజెంటేషన్లు ఇస్తుంటే అవతలి వైపు విపక్షాలు 'సర్జికల్ స్ట్రైక్' అంటూ కత్తులు నూరుతున్నాయి.ప్రభుత్వం పక్కా ప్లాన్‌తో ఏడీబీ బ్యాంకు నుంచి అప్పు తెచ్చి, మూసీని సుందరీకరిస్తామని చెబుతుంటే.. విపక్షాలేమో "మా ఇల్లు కూల్చేస్తారా?" అంటూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. నిజానికి ఈ విల్లాలు, అపార్ట్‌మెంట్లు కట్టినప్పుడు ఆ గూగుల్ మ్యాప్స్ అప్పట్లో ఎక్కడికి వెళ్లాయో ఎవరికీ అర్థం కావడం లేదు.మూసీ ప్రక్షాళన అనేది పాతకాలపు సీరియల్ లాంటిది. చంద్రబాబు సమయంలో "నందనవనం" పేరుతో కాలువ కడితే.. అది వర్షానికి 'నీట' మునిగింది. వైఎస్ఆర్ హయాంలో "సేవ్ మూసీ" అంటూ రబ్బరు డ్యామ్ కడితే.. అది వరదకు కొట్టుకుపోయింది. కేసీఆర్ పాలనలో "రివర్ ఫ్రంట్" అని కార్పొరేషన్ పెట్టారు.. అది చివరికి రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. ఇప్పుడు రేవంత్ గారు "గాంధీ సరోవరం" అంటున్నారు. చరిత్ర పాఠాలు చదివితే.. "మూసీ ప్రక్షాళన" అంటేనే ఒక పెద్ద 'ప్రాజెక్ట అటకెక్కింపు' కార్యక్రమం అని అర్థమవుతోంది.అక్రమ కట్టడాల కూల్చివేత విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటే, పేదవాడి కన్నీరు.. అదే పెద్ద పెద్ద విల్లాల దగ్గర కొచ్చేసరికి 'సర్దుబాటు' రాజకీయాలు.. ఇదే కదా మన హైదరాబాద్ స్పెషాలిటీ! సర్కార్ ఏమో లండన్ కలను చూపిస్తుంటే.. నిర్వాసితులు మాత్రం 'మా గూడు మాకుండనివ్వండి' అని ప్రాధేయపడుతున్నారు.చివరికి మూసీ మారుతుందో లేదో తెలియదు కానీ, రాజకీయ పార్టీలకు మాత్రం మూసీ ఒక 'శాశ్వత ఆదాయ వనరు'గా 'నిరంతర విమర్శనాస్త్రం'గా మారిపోయింది. మొత్తానికి మూసీకి శుద్ధి ఎప్పుడు జరుగుతుందో కానీ, రాజకీయ నాయకులకు మాత్రం ఈ ఇష్యూతో ఎప్పుడూ 'పబ్లిసిటీ' పుష్కలంగా దొరుకుతోంది.

# గ్యాస్ సరఫరాలో పారదర్శకతకు ప్రాధాన్యం

### రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

జయశంకర్ భూపాలపల్లి,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా పారదర్శకంగా, నిరంతరంగా కొనసాగాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం భూపాలపల్లిలోని హెచ్‌పీ గ్యాస్, సింగరేణి కాలరీస్‌కు చెందిన గ్యాస్ ఏజెన్సీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు అందిస్తున్న సేవలు, గ్యాస్ సరఫరా విధానం, నిల్వల పరిస్థితి, భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వ, పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన వినియోగదారులకు సమయానికి గ్యాస్ సరఫరా అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను పాటించాలని సూచిస్తూ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఎల్పీజీ డీలర్లు వినియోగదారుల బుకింగ్ సీక్వెన్స్‌ను తప్పనిసరిగా పాటిస్తూ గ్యాస్ రీఫిల్స్‌ను సరఫరా చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమాన్ని అతిక్రమించకూడదని ఆదేశించారు. జిల్లాలో గ్యాస్ కొరత ఎక్కడా లేదని ఆయన స్పష్టం చేశారు.

# ప్రైవేటు దవాఖానాలపై సర్కార్ నిఘా

వరంగల్, మార్చి 17, (న్యూస్ పల్స్)తెలంగాణలో ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత పారదర్శకం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద ప్రతి హాస్పిటల్ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి. సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ విధానం ద్వారా ఫేక్ డాక్టర్లు, అనధికారిక క్లినిక్‌లకు అడ్డుకట్ట వేస్తూ హాస్పిటల్ పూర్తి వివరాలను ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు.తెలంగాణలో నకిలీ వైద్యులు ఎక్కువైపోయారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 250 నకిలీ హాస్పిటల్స్ ఉన్నట్లు తేలింది. అర్హత లేకున్నా డాక్టర్లుగా చెలామణి అవుతూ.. కాసుల కోసం హాస్పిటల్స్ ఓపెన్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నకిలీ వైద్యానికి చెక్ పెడుతూ.. ఆన్‌లైన్‌లోనే ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసింది. ప్రైవేటు హాస్పిటల్ నడపాలంటే తప్పనిసరిగా అవి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని అమలు చేయాల్సి ఉంటుంది.ఇందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం జిల్లా వైద్యాధికారి ఆఫీసుకు వెళ్లాలనే నిబంధన ఉంది. ఈ విధానం వల్ల పలు ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే అనధికారికంగా ఆసుపత్రులను నడిపిస్తున్నారు. అటువంటి ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలో ఇటీవల పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ఫిజియోథెరపీ కేంద్రాలు కూడా సీఈఏను పట్టించుకోవడంలేదని తెలిసింది. ఇక నుంచి ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా సర్కారు వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ సీఈఏ కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో తాజాగా పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు.ఆసుపత్రి రిజిస్ట్రేషన్ కోసం కాలుష్య నియంత్రణ మండలి ధ్రువీకరణ పత్రం, బయోమెడికల్ వ్యర్థాల వివరాలు,

ఫైర్ డిపార్ట్‌మెంట్ అనుమతులు, పనిచేసే డాక్టర్లు, నర్సులు.. వారి అర్హత, అందిస్తున్న సేవలు.. వైద్య సేవల ధరలు, పడకల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేశాక జిల్లా వైద్యాధికారి పరిశీలించి కలెక్టర్‌కు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పంపిస్తారు. కలెక్టర్ పరిశీలించి అనుమతికి అంగీకరిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.నల్గొండ, ప్రస్తుతం కొన్ని అలోపతి హాస్పిటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా హోమియో డాక్టర్లు కూడా పనిచేస్తున్నారు. ఆర్ఎంపీలు అర్హత లేకున్నా హాస్పిటల్స్ నడిపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ కావడం వల్ల ఇకపై ఇలాంటి వాటికి కూడా అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంటున్నారు. త్వరలోనే ప్రజలు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించి సకల సమాచారం ఆన్‌లైన్‌లోనే చూసేలా పోర్టల్ అభివృద్ధి జరుగుతోందని చెబుతున్నారు.





ఈరోజు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో మండల అధ్యక్షులు నేతృత్వంలో స్థానిక మండల కార్యాలయాల లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు జే.నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజల ను ఆరు గ్యారెంటీల పేరు మీద మోసం చేసి గద్దెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని హైదరాబాద్ ఎమ్మార్వో కార్యాలయం లో వినతి పత్రం అందించడం జరిగింది

# రాష్ట్ర బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమానికి 25వేల కోట్లు కేటాయించాలి

హైదరాబాద్‌రాష్ట్ర బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమానికి 25వేల కోట్లు కేటాయించాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమానికి 25 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేతి వృత్తిదారులు మహా ధర్నాను చేపట్టారు. ఈ మహా ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, చేతి వృత్తి దారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమణ హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న చేతి వృత్తుదారుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో చేతి వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుందని పేర్కొన్నారు. చేతి వృత్తుల్లోకి పెట్టుబడిదారులు ప్రవేశించడంతో ఆయా వృత్తులు వ్యాపారంగా మారి వృత్తిదారుల జీవితాలు దుర్భరంగా మారుతున్నారు. ప్రభుత్వం కేవలం కల్లు గీత కార్పొరేషన్కు మాత్రమే 17 కోట్లు విడుదల చేసిందని ఆ నిధులను కూడా పూర్తిగా సద్వినియోగ పరచలేదని రాష్ట్ర చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ ఆరోపించారు. ప్రభుత్వం చేతి వృత్తిదారుల కార్పొరేషన్లన్నింటికీ నిధులు కేటాయించడంతోపాటు ఆయా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### లోక్ సభ స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

న్యూఢిల్లీ,భువనగిరి లోక్ సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు 8 మంది కాంగ్రెస్ లోక్ సభ సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేసారు. ఈ నేపథ్యంలో లోక్ సభ స్పీకర్ సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత గాంధీ విగ్రహం వద్ద 8 మంది కాంగ్రెస్ ఎంపీలు నివాళులు అర్పించారు. ఎంపి చామల మాట్లాడుతూ సభలోకి ప్లకార్డులు తేవద్దు,వెల్ లోకి రావద్దని స్పీకర్ చెప్పారు. సభను డిస్ట్రబ్ చేయాలని మేము అనుకోవడం లేదు. ఎన్నో ఆశలతో మమ్మల్ని ప్రజలు పార్లమెంట్ కు పంపించారు. లోక్ సభ స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.



హైదరాబాద్,మార్చి 17 (ఇయ్యాల తెలంగాణ) : ఎస్సీ అభివృద్ధి శాఖ చైర్మన్ నగరగారి ప్రీతం ని ఆయన ఛాంబర్లో గోషామహల్ నియోజకవర్గం ఎగ్జిబిషన్ గ్రౌండ్ మరియూ జంభాగ్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముంద్రాయి శ్రీనివాస్ దాసరి రాజ్ కుమార్ లు కలిసి డివిజన్ లో ఉన్న ఎస్సీ నిరుద్యోగుల గురించి మాట్లాడడం జరిగింది.

ఇయ్యాల తెలంగాణ
బుధవారం 18-03-2026

# 'ముస్లింల స్మశాన వాటికలో పందులను నిర్మూలించాలి'

## మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా



పాల్వంచ, మార్చి 17 : పాల్వంచ పట్టణంలోని నటరాజ్ సెంటర్‌లో ఉన్న ముస్లింల స్మశాన వాటికలో పందుల సంచారం పెరిగిపోవడంతో పాటు అక్కడే పందులను కాల్చడం, కోయడం, మాంసం విక్రయించడం జరుగుతుండటంపై మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యాకూబ్ పాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంగళవారం జిల్లా కలెక్టర్, మేయర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 75 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ స్మశాన వాటికలో ముస్లింల పూర్వీకుల సమాధులు ఉన్నాయని, ప్రతి శుక్రవారం అలాగే రంజాన్, బక్రీద్ వంటి పవిత్ర పండుగల సమయంలో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పుష్పాంజలి ఘటించి ప్రార్ధనలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు.అయితే కొంతమంది పందుల పెంపకదారులు తమ వ్యాపారానికి ఈ స్మశాన వాటికను అడ్డాగా మార్చుకోవడంతో ముస్లింల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు. గతంలో అధికారులు స్మశాన వాటిక చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించినప్పటికీ, కొంతమంది దానిని తొలగించి పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేస్తూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 21న పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి పందుల పెంపకందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్మశాన వాటికను రక్షించే చర్యలు చేపట్టి ముస్లింల మనోభావాలను కాపాడాలని జిల్లా కలెక్టర్, మేయర్‌ను ఆయన కోరారు.


# 'జీవనోపాధులను దెబ్బతీస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు'



రామన్నపేట, మార్చి 17 : ప్రజల జీవనోపాధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బతిస్తున్నాయని సిపిఐ రామన్నపేట మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహ అన్నారు. రామన్నపేటలోని సుభాష్ సెంటర్ వద్ద సిపిఐ కేంద్ర, రాష్ట్ర పార్టీల పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాద మొండి నిర్ణయాలకు వ్యతిరేకంగా ముందస్తు నిర్ణయాలు తీసుకోకుండా దేశ ప్రజలను అయోమయంలోకి నెట్టి గ్యాస్ ఇతర నిత్యావసర ధరలు పెంచడాన్ని నిరసిస్తూ మంగళవారం సుభాష్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. యుద్ధ వాతావరణం ఏర్పడినప్పుడు ఎగుమతులు, దిగుమతుల విషయంలో దేశానికి అవసరమైన పెట్రోల్, డీజిల్, గ్యాస్ దిగుమతులను ముందస్తుగానే గుర్తించి తగిన నిల్వలను ఏర్పాటు చేయకుండా దేశ వ్యాప్తంగా ప్రజల జీవనోపాధులు దెబ్బ తినే విధంగా చేశారన్నారు. గ్యాస్ కొరతను ముందస్తుగా గుర్తించకుండా కాలయాపన చేసి నిర్లక్ష్యంతో ప్రజలకు నానా ఇబ్బందులు సృష్టించారని దుయ్యబట్టారు.అమెరికా ఇరాన్ పై చేస్తున్న దాడిని ఖండించి శాంతి వాతావరణం నెలకొనేలా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకుడు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కళ్లెం రామచంద్రం, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, శివరాత్రి సమ్మయ్య, బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంత, గంగాపురం వెంకటయ్య, వీరమల్ల ముత్తయ్య, గంగాపురం యాదయ్య, పల్లె మల్లేశం, పర్స సుదర్శన్, ఊట్కూరు కృష్ణ, ఊట్కూరు శీను, పెండెం రవీందర్, ఏనూతుల రమేశ్, కడమంచి జగన్నాథం, వీసం గాలయ్య, ఊట్కూరు శంకర్, జెల్లా అంబయ్య, శ్రావణ్, ఊట్కూరు శంకర్ పాల్గొన్నారు.

# ఎంజీయూ పీజీ థర్డ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

రామగిరి, మార్చి 17 : నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలోని పీజీ విద్యార్థులకు జనవరి 2026లో నిర్వహించిన మూడవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను నేడు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ డాక్టర్ కొప్పుల అంజి రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్



డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి, పర్సనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సంధ్యారాణి, లక్ష్మీప్రభ, ప్రవళిక, కళ్యాణి, భిక్షమయ్య పాల్గొన్నారు. పరీక్షలకు మొత్తం 1,092 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 821 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 24 మంది విద్యార్థులు ప్రమోట్ అయ్యారు. 246 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో అణుతీర్ణులయ్యారు. ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేయబడింది.

# రైల్వే లైన్ భూసేకరణపై జేసీతో సమావేశం

## కొలిక్కిరాని పరిహారం చెల్లింపు



కారేపల్లి, మార్చి 17 : డోర్నకల్- భద్రాచలం రోడ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం భూ సేకరణ చేసిన భూములకు రేటు విషయంలో చర్చించేందుకు ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి సింగరేణి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాసితులు కోరిన రేటును నిర్ణయించేందుకు అధికారులు అంగీకరించకపోవడంతో చర్చలు కొలిక్కి రాలేదు. వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.91 లక్షల చొప్పున, ఇళ్ల స్థలాలకు గజానికి రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని బాధితులు అధికారులను కోరారు. ఆ రేటు సాధ్యపడదని అధికారులు తేల్చివేస్తూ వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.18 లక్షలు, ఇళ్ల స్థలాలకు గజానికి రూ.6,300 చెల్లిస్తామని స్పష్టం చేశారు. నిర్మించిన ఇళ్ల విషయంలో మున్నీర్ అనే బాధితుడి ఇంటికి ఆర్ అండ్ బి అధికారుల ఎస్టిమేషన్ అదనంగా కల్పించే పరిహారంతో రూ.46 లక్షలు వస్తాయని ఉదాహరిస్తూ అధికారులు ప్రకటించారు.ఏజెన్సీ ప్రాంతాల భూసేకరణలో చెల్లించిన రేట్లనే చెల్లిస్తామని అధికారులు పేర్కొనడంతో దానికి నిర్వాసితులు అంగీకరించలేదు. నాన్ ఏజెన్సీ విషయంలో అక్కడి భూముల ధరలను కూడా పరిగణలోకి తీసుకుని మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని బాధితులు కోరారు. మరోసారి ఏర్పాటు చేసే సమావేశం నాటికి ఆలోచించుకుని నిర్ణయం తెలపాలని అధికారులు పేర్కొన్నారు. రైతులు, ఇళ్లు కోల్పోయిన వారు కోరిన విధంగా పరిహారాన్ని చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ సింగరేణి సర్పంచ్ వేదరి వీరప్రతాప్ ఆధ్వర్యంలో జేసీ శ్రీనివాసరెడ్డికి నిర్వాసితులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో సింగరేణి తాసీల్దార్ రమేశ్, రైల్వే జేఈ శ్రీకాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జగదీశ్, జీపీఓ బంపర్ పాల్గొన్నారు.

# ఇండియాకు చేరుకున్న 'నందా దేవి'.. 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో గుజరాత్ వచ్చిన నౌక

న్యూ ఢిల్లీ, ఎల్పీజీ చమురు కలిగిన రెండో నౌక మంగళవారం గుజరాత్ పోర్టుకు చేరుకుంది. ఎల్పీజీ ట్యాంకర్లతో కూడిన ఎంటీ నందాదేవి అనే పేరుగల నౌక మంగళవారం గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు చేరుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నౌక హోర్ముజ్ జలసంధి నుంచి ఇక్కడికి రావడం విశేషం. ఇరాన్ యుద్ధం ప్రారంభమయ్యాక ఈ జలసంధి నుంచి ఇండియా చేరుకున్న రెండో నౌక ఇది. ఈ నౌకలో దాదాపు 46,500 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది.ఈ నౌక నుంచి చమురును బదిలీ చేసే చర్యను వెంటనే ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీన్‌దయాల్ పోర్ట్ అథారిటీ ఛైర్మన్ సుశీల్ కుమార్ సింగ్, నౌక వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నౌకలోని ట్యాంకర్ల నుంచి చమురును వెంటనే ఇక్కడి నౌకల్లోకి బదిలీ చేసి, చమురు యూనిట్లకు తరలించే ఏర్పాట్లు వేగవంతం చేయాలని సూచించారు.




జామ్‌నగర్ సమీపంలోని వాడినార్ పోర్టు నుంచి ఇండియా అవసరాలకు సరిపడా చమురు భారీ స్థాయిలో దిగుమతి అవుతుంటుంది. మన దేశానికి అవసరమైన చమురును అందించడంలో ఈ పోర్టు చాలా కీలకం. ఇటీవల హోర్ముజ్ జలసంధి మార్గంలో రెండు భారతీయ నౌకలను ఇరాన్ అనుమతించిన సంగతి తెలిసిందే.శివాలిక్, నందా దేవి అనే నౌకలకు అనుమతించగా.. అందులో నందాదేవి ఇప్పుడు ఇండియా చేరుకుంది. శివాలిక్ నౌక సోమవారం ఇండియా చేరుకుంది. ఈ నౌకలో 40,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఇండియా చేరుకుంది. ఈ నౌకలు ఇండియా చేరుకునేందుకు ఇరాన్ తగిన సాయం అందించింది. ఇక 81,000 క్రూడాయిల్ కలిగిన జాగ్ లాడ్కి అనే నౌక ప్రస్తుతం మార్గమధ్యలో ఉంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఇంకా 22 ఇండియన్ నౌకలు చిక్కుకున్నాయి.

# ఇరాన్‌లో అడుగుపెడితే రెండో వియత్నామే.. నెతన్యహూ ఆఫీసు సమీపంలో పడిన మిస్సైల్

టెహ్రాన్: ఇరాన్‌లోని కీలకమైన ఖర్గ్ దీవిలో గ్రౌండ్ ఆపరేషన్ చేపట్టేందుకు అమెరికా ఆసక్తిగా ఉన్న విషయం తెలిసిందే. ఆ దీవిలో ఉన్న మిలిటరీ కేంద్రాలను ధ్వంసం చేసిన అమెరికా .. అవసరమైతే త్వరలో ఆ దీవిలో అడుగుపెట్టే అవకాశాలు కూడా ఉన్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ నేపథ్యంలో ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖటిబ్‌జాదే వార్నింగ్ ఇచ్చారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఒకవేళ



అమెరికా బలగాలు ఇరాన్‌లో కాలుమోపితే, అప్పుడు వాళ్లు మరో వియత్నం యుద్ధాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. టెహ్రాన్‌లోని తన ఆఫీసు నుంచి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అమెరికా-ఇజ్రాయెల్ దళాలతో వీలైనన్ని రోజులు పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. యుద్ధాన్ని ఆపేందుకు దౌత్యపరమైన పరిష్కారం కోసం వెతకడం లేదన్నారు. ఇరాన్ ఆపరేషన్ గురించి ట్రంప్ కామెంట్ చేసిన అంశంపై ప్రశ్న వేయగా.. ఓసారి వియత్నాంలో ఏం జరిగిందో చదువుకోవాలని మంత్రి కటిబ్‌జాదే అన్నారు. ఇరాన్ కొత్త సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. పబ్లిక్‌గా కనిపించకపోయినా ఆయన ఇంచార్జీ బాధ్యతలు చేపడుతున్నట్లు తెలిపారు.మరో వైపు ఇరాన్ తాజాగా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడి చేసింది. వెస్ట్ జెరుసలాంలో ఉన్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజిన్ నెతన్యహూ ఆఫీసుకు కొన్ని మీటర్ల దూరంలో క్షిపణి పడినట్లు ఇరాన్ న్యూస్ ఏజెన్సీ ఎస్ఎన్ఎన్ పేర్కొన్నది. అయితే ఐడీఎఫ్ కూడా ఈ క్షిపణి గురించి ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. ఐడీఎఫ్‌కు చెందిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఓ క్షిపణిని కూల్చగా, కొన్నింటిని వదిలేసినట్లు చెప్పింది.

# 'ఏదుల నుండి డిండికి 436 మీటర్ల ఎత్తు నుండే నీటిని సరఫరా చేయాలి'

## చండూరు తాసీల్దార్‌కు ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ వినతి

చండూరు, మార్చి 17 : ఏదుల రిజర్వాయర్ నుండి డిండి ప్రాజెక్టుకు 436 మీటర్ల ఎత్తు నుండే నీటి సరఫరా చేయాలని ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. ఈ మేరకు ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ ఆదేశానుసారం మంగళవారం చండూరు తాసీల్దార్ రమాకాంత్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా డిండి ఎత్తిపోతల పథకం ద్వారా చండూరు మండల ప్రజలకు తాగు, సాగునీటిని అందిస్తామని ప్రభుత్వాలు చెబుతూ వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దీనికోసం చర్లగూడెంతో పాటు పలు రిజర్వాయర్లను 30 టీఎంసీల నీటిని నింపడానికి నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నార్లాపూర్ రిజర్వాయర్ నుండి ఏదుల రిజర్వాయర్‌కు అటు నుండి ఒకవైపు పట్టెం రిజర్వాయర్‌కు మరోవైపు డిండి కాల్వలకు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ రెండు వైపులా నీటిని ఏదులా రిజర్వాయర్ లోని 436 మీటర్ల ఎత్తు నుంచి సరఫరా చేయాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారు.అయితే ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇరిగేషన్ ఇంజినీర్లు 436 మీటర్ల ఎత్తు వద్ద నుంచి పట్టెం రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారని, పైగా ఆరు మోటర్ పంపులకు బదులు రెండు టీఎంసీలు తీసుకునే విధంగా ఎనిమిది మోటార్లతో పాటు అదనంగా మరో మోటార్‌ను బిగించారని తెలిపారు. దీని ద్వారా ఏకంగా రోజుకు రెండు టీఎంసీలకు పైగా నీటిని తీసుకునే అవకాశాన్ని కల్పించారు. డిండి కాలువలకు మాత్రం 440 మీటర్ల ఎత్తు నుండి నీటిని తీసుకోవాలని తప్పుడు పద్ధతిలో నిర్ణయించి ఈఎన్‌సీకి సిఫారసు చేసి సంతకాలు చేయించారని తెలిపారు. ఇంజినీర్ల ద్వంద నీతి నిర్ణయంతో డిండి కాలువకు కృష్ణా జలాలు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి : జడ్పీ సీఈఓ శోభారాణి



బీబీనగర్, మార్చి 17 : ప్రభుత్వ పథకాల అమలు సమర్థంగా జరగాలని యాదాద్రి భువనగిరి జడ్పీ సీఈఓ శోభారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో ఆమె ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని నర్సరీతో పాటు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, సంరక్షణ విధానాలు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే ఆరోగ్య ఉప కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, రోగుల నమోదు తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రత, పారిశుధ్యంలో విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.సర్పంచ్, పాలకవర్గం ఐక్యతతో పనిచేసి గూడూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సీఈవో సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ జడ్పీ సీఈఓ శోభారాణిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాన సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు భాషబోయిన బాలప్రసాద్, తోరుపునూరి అశ్విని, బాలరాజ్ గౌడ్, దంతూరి శ్రీనివాస్ గౌడ్, కసగోని అరుణ సత్యంగౌడ్, బింగి సంజయ్‌కుమార్, అంకర్ల శ్రీనివాస్, బింగి లావణ్య రమేశ్, దొనకొండ శ్రీరాములు పాల్గొన్నారు.

# మారణహోమాన్ని యుద్ధంలా చిత్రీకరిస్తారా.. ఆఫ్ఘన్‌పై పాక్ దాడి చేయడంపై ఇండియా ఆగ్రహం



ఆఫ్ఘనిస్తాన్‌లోని కాబూల్ ఆస్పత్రిపై పాక్ జరిపిన దాడి ప్రపంచాన్ని షాక్‌కు గురి చేస్తోంది. యుద్ధ రీతిని పక్కనబెట్టి ఒక ఆస్పత్రిపై పాక్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది మరణించారు. మరో 300 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఆఫ్ఘన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు ఇండియా కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఈ దాడిని పాక్ చేసిన క్రూరమైన మారణహోమంగా అభివర్ణించింది.ఆఫ్ఘన్‌పై దాడిపై భారత కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ స్పందించింది. ఈ దాడి ఎంతమాత్రం యుద్ధ చర్య అనిపించుకోదని, ఈ మారణహోమాన్ని పాక్ ఒక ఆర్మీ ఆపరేషన్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని మండిపడింది. ఆఫ్ఘన్ రాజధాని కాబూల్‌లోని ఒక డ్రగ్స్ చికిత్స కేంద్రంపై పాక్ సోమవారం రాత్రి దాడి చేసింది. ఈ దాడిలో 400 మంది మరణించగా, 300 మందికిపైగా గాయపడ్డారు. ఇలా ఆస్పత్రిపై దాడి చేయడం అంతర్జాతీయ యుద్ధ చట్టాలకు వ్యతిరేకం. దీనిపై ఆఫ్ఘన్ సహా అనేక దేశాల పాకిస్తాన్‌ను విమర్శిస్తున్నాయి. ఇండియా కూడా ఘాటుగా స్పందించింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ తన చర్యను సమర్థించుకునే ప్రయత్నం చేసింది. ఇది కావాలని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా వర్ణించింది. తాము ఆయుధ కేంద్రాలనే లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు తెలిపింది.తమ దేశంలో దాడులు చేస్తున్న తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) అనే తీవ్రవాద సంస్థకు ఆఫ్ఘన్ స్వర్గధామంగా మారిందని, అందువల్లే ఆ సంస్థపై దాడులు చేస్తున్నామని పాక్ చెబుతోంది. అయితే, దీన్ని తీవ్రంగా తప్పుబట్టిన ఇండియా ఈ దాడిని క్రూరమైన, దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. ఇది ఆఫ్ఘన్ సార్వభౌమధికారంపై జరిగిన దాడి అని, ఇలాంటి దాడుల వల్ల ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం దెబ్బతింటాయని భారత్ వ్యాఖ్యానించింది.

# ప్రధాని మోదీని కలిసిన వరుణ్ గాంధీ ఫ్యామిలీ

న్యూఢిల్లీ: మాజీ బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ ఇవాళ ప్రధాని మోదీని కలిశారు. తన ఫ్యామిలీతో కలిసి ప్రధానిని వరుణ్ మీటయ్యారు. గతంలో ఫిలిబిత్ నియోజకవర్గం నుంచి వరుణ్ గాంధీ ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీతో ఇవాళ వరుణ్‌కు అపాయింట్‌మెంట్ దొరికినట్లు సమాచారం తెలిసింది. దివంగత సంజయ్ గాంధీ కుమారుడే వరుణ్ గాంధీ. వరుణ్ గాంధీ తన ఎక్స్ అకౌంట్‌లో ఫోటోను పోస్టు చేశారు. వరుణ్ భార్య యామినీ రాయ్ చౌదరీ, కుమార్తె అనసూయ చాలా హ్యాప్ మూడ్‌లో ఉన్నట్లు ఆ పిక్‌లో కనిపించారు. అయితే మోదీతో వరుణ్ గాంధీ దిగిన ఫోటో వైరల్ కావడంతో.. మళ్లీ



బీజేపీలో వరుణ్ గాంధీ క్రియాశీలకంగా మారే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల వేళ వరుణ్ గాంధీని పక్కనపెట్టారు. 2024లో ఫిలిబిత్ నుంచి మాజీ కాంగ్రెస్ నేత జితిన్ ప్రసాద్ బీజేపీ తరపున పోటీ చేశారు. వాస్తవానికి ఫిలిబిత్ నియోజకవర్గం వరుణ్ తల్లి మనేకా గాంధీ సీటు కావడం గమనార్హం. అయితే 2021లో లకింపూర్‌లో జరిగిన రైతుల హింస ఘటనపై వరుణ్ బీజేపీ తీరును ఖండించారు. నిరుద్యోగంతో ఉజ్వల స్కీమ్ ఇంకా పలు కేంద్ర ప్రభుత్వ పాలసీలపై వరుణ్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అన్న నినాదాలతో సమస్యలు తీరవని కూడా వరుణ్ అన్నారు.కాంగ్రెస్ పార్టీలో వరుణ్ గాంధీ చేరే అవకాశాలు ఉన్నట్లు గతంలో ఊహాగానాలు వినిపించాయి. ఓ సారి కేదార్‌నాథ్‌లో వరుణ్, రాహుల్ గాంధీలు కలుసుకున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు వరుణ్ నిరాకరించారు.

ఇయ్యాల తెలంగాణ



# 25న గులాబీ కండువా కప్పుకోనున్న జీవన్ రెడ్డి !

కరీంనగర్, మార్చి 17, (న్యూస్ పల్స్)సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి.. ఇక పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 4 దశాబ్దాలుగా హస్తం పార్టీలో ఉన్న జీవన్ రెడ్డి.. ఇక చేతికి గుడ్‌బై చెప్పి.. కారు ఎక్కనున్నట్లు సమాచారం. ఈనెల 25న గులాబీ కండువా కప్పుకునేందుకు జీవన్ రెడ్డి రెడీ అయినట్లు సంబంధిత వర్గాల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు జీవన్ రెడ్డి ఇంటి వద్ద కాంగ్రెస్ ఫ్లెక్సీలు చించేయడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ మంత్రి, హస్తం పార్టీ సీనియర్ నేత టీ జీవన్ రెడ్డి .. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలతో తీవ్ర మనోవేదనకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అవమానాలు ఎదురవుతున్నాయని.. ఆయన బహిరంగంగా మీడియా ముందే వెల్లడించడం గమనార్హం. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.. గతంలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరగా.. అప్పటి నుంచి జగిత్యాలలో వర్గపోరు మొదలైంది.అది కాస్తా ఇటీవలి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తారస్థాయికి చేరుకుంది. తమ వర్గం వారికి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేసిన జీవన్ రెడ్డి.. తమ అనుచరులను ఇండిపెండెంట్లుగా పోటీ చేయించి.. గెలిపించుకుని తన సత్తా ఏంటో హైకమాండ్‌కు తెలియజేశారు. అయినప్పటికీ తనకు సరైన గుర్తింపు లేకపోవడంతో పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు తన అనుచరులతో జీవన్‌రెడ్డి చెప్పినట్లు సమచారం. ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరనున్నట్లు తెలుస్తోంది. గత 4 దశాబ్దాలుగా జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన జీవన్‌రెడ్డి.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా గెలిచారు. అయితే డాక్టర్ సంజయ్ కుమార్ రాకతో కాంగ్రెస్ పార్టీలో తనకు ప్రాధాన్యం లేనందునే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఈనెల 25వ తేదీన జగిత్యాలలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి.. గులాబీ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. జగిత్యాలలో ఉన్న జీవన్ రెడ్డి ఇంటి వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ ఫ్లెక్సీలను.. ఆయన అనుచరులు చించేయడం, తొలగించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆయన నివాసం ముందు, లోపల ఉన్న కాంగ్రెస్ పార్టీ జెండాలు, అగ్రనాయకుల ఫోటోలతో కూడిన బ్యానర్లను కార్యకర్తలు తీసేశారు. కేవలం జీవన్ రెడ్డి మాత్రమే ఉన్న ఫోటోలు, ఫ్లెక్సీలను ఉంచుతున్నారు. తాను పార్టీకి ఎంత చేస్తున్నా దాన్ని అధిష్టానం గుర్తించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన జీవన్ రెడ్డి.. ఇక కాంగ్రెస్ పార్టీతో బంధం తెంచుకోవడమే మేలు అని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తన అనుచరులతో సుదీర్ఘంగా మంతనాలు జరిపిన తర్వాతే.. పార్టీ మార్పుపై జీవన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.తెలంగాణ రాజకీయాల్లో



అత్యంత సీనియర్ నేతగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్రవేసుకున్న మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా నిలిచిన ఆయన, ఇప్పుడు ఆ పార్టీకి చేయి ఇచ్చి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ పరిణామం జగిత్యాల జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. టీ. జీవన్ రెడ్డి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి అనే రీతిలో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయం సాగింది. అయితే, గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు ఆయనను తీవ్రంగా కలిచి వేస్తున్నాయి. ముఖ్యంగా రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ప్రస్తుత జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో జీవన్ రెడ్డికి పొసగడం లేదు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన తనకు కాకుండా, పక్క పార్టీ నుంచి వచ్చిన వారికి అధిష్ఠానం ప్రాధాన్యత ఇవ్వడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సమయంలో టికెట్ల కేటాయింపు నుంచి చైర్‌పర్సన్ పదవి వరకు అన్ని నిర్ణయాల్లోనూ సంజయ్ కుమార్ వర్గానికి పెద్ద పీట వేశారని, దీని వల్ల జీవన్ రెడ్డికి పార్టీలో ప్రాధాన్య తగ్గుతూ వచ్చిందని ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తను కాదని సంజయ్ కుమార్‌కు నియోజకవర్గ పగ్గాలు అప్పగించడం, స్థానిక నిర్ణయాల్లో తన ప్రమేయం లేకుండా పోవడం ఆయనను తీవ్రంగా బాధించింది. తనకు, తనను నమ్ముకున్న అనుచరులకు పార్టీలో కనీస గౌరవం, ప్రాధాన్యత దక్కడం లేదని జీవన్ రెడ్డి భావిస్తున్నారు. సీనియర్ నేతా తన సలహాలను పక్కనపెట్టి, కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇవ్వడం ఆయనకు మింగుడుపడటం లేదు. ఈ క్రమంలోనే ఆయన తన సన్నిహితులు, ముఖ్య అనుచరులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీలో మనకు గుర్తింపు లేనప్పుడు ఇక్కడ కొనసాగడం కంటే ప్రత్యామ్నాయం చూసుకోవడమే ఉత్తమం అనే అభిప్రాయానికి ఆయన వచ్చినట్టు సమాచారం. సోషల్ మీడియా ఖాతాల నుంచి కాంగ్రెస్ పేరును తొలగించడం, తన అనుచరుల సోషల్ మీడియా పోస్టులు పార్టీ మార్పును ధృవీకరిస్తున్నట్టు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ బహిరంగంగా మాత్రం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు అని ఆయన కొంత సమయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ నెల 25న జగిత్యాలలో ఒక భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ వేదికపైనే ఆయన తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి, వేలాది మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌తో టచ్‌లో ఉన్నారని సమాచారం. పార్టీలో ఆయనకు సముచిత స్థానం, తగిన గౌరవం ఇస్తామని బీఆర్ఎస్ అధిష్ఠానం నుంచి గట్టిగా హామీ లభించినట్టు తెలుస్తోంది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడటం కాంగ్రెస్‌కు పెద్ద షాక్ అని చెప్పవచ్చు. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకు పటిష్టమైన క్యాడర్ ఉంది. ఆయన నిర్ణయం వల్ల కాంగ్రెస్ బలం తగ్గే అవకాశం ఉండగా, బీఆర్ఎస్‌కు ఇది ఉత్తర తెలంగాణలో పెద్ద బూస్ట్‌గా మారనుంది. జగిత్యాలలో బీఆర్ఎస్ బలం మళ్లీ పుంజుకోవడానికి జీవన్ రెడ్డి రాక ఒక వరంలా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# చండూరు లో ఉద్రిక్తత

నల్గొండ.నల్గొండ జిల్లా చండూరు పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ, ఈ రోజు పట్టణ బంద్కు పిలుపునిచ్చారు రాష్ట్ర బీజేపీ నాయకుడు గంగిడి మనోహర్ రెడ్డి.బంద్లో భాగంగా చండూరు పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ ఎక్స్ రోడ్ వద్ద ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ? బీజేపీ కార్యకర్తలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్కు పంపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.దాడిలో మొత్తం ఎనిమిది మంది కార్యకర్తలు గాయపడగా, అందులో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. ఒకరికి తల గాయం కాగా, మరొకరికి పన్ను ఊడిపోయినట్లు చెప్పారు.పోలీసులు కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన ఆయన, దాడి చేసిన వారిపై 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు.ఇక స్థానిక ఎమ్మెల్యే ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించిన ఆయన? పోలీసులు కూడా ఈ ఘటనను తేలికగా తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ బంద్ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా నాయకులు పిల్లి రామరాజు యాదవ్ సహా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు భరోసా ఏకకాలంలో ఇవ్వాలి : అఖిల భారత ఐక్య రైతు సంఘం




పాల్వంచ, మార్చి 17 : రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి యాసంగి సీజన్ కు సంబంధించిన రైతు భరోసా డబ్బులను ఏకకాలంలో రైతులకు చెల్లించాలని అలాగే రైతులు పండించిన పంటలకు మొక్కజొన్న, ఎర్రజొన్న,ఇతర పంటలకు కనీసం మద్దతు ధరలను అమలు చేయాలని డిమాండ్‌తో అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యా లయంలో ఏఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద భిక్షం, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి

రాము మాట్లాడుతూ.. దేశంలోనూ, రాష్ట్రంలోనూ రైతాంగం బ్రతుకులు దినదిన గండంగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వాలు సకాలంలో స్పందించడంలో విఫలమవుతున్నాయని, దీనివల్ల రైతాంగం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. వానాకాలం సీజన్ ముగిసి యాసంగి సీజన్ సగం అయినా ప్రభుత్వ సాయాలు లేవన్నారు.విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్ బాడుగలు, నాట్లు తదితర వ్యవసాయ ఖర్చుల కోసం పెద్ద మొత్తంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల దగ్గర అధిక వడ్డీలకు తీసుకు రావాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం రైతు భరోసా సకాలంలో ఇవ్వకపోవడంతో రాష్ట్ర రైతాంగం అప్పుల పాలై తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం పోడు సాగుదారులందరికి పట్టాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు ముగిసినప్పటికీ కూడా ఈనాటి వరకు పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటికే మొక్కజొన్న, ఇతర పంటలు రైతుల వద్దకు వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, తక్షణమే మార్కెట్లు ఓపెన్ చేసి పంట కొనుగోలు చేయాలన్నారు. రైతుల పంటలన్నిటికీ గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేస్ ) జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మ, మాచర్ల సత్యం, జాటోత్ కృష్ణ, బైరు వెంకటేశ్వర్లు, బానోత్ వీరు, బాలు, శత్రు, వీరస్వామి, రమణి, సరోజ స్వప్న పాల్గొన్నారు.

# గిట్టుబాటులేక.. ఫ్రీగా టమాట...

మెదక్, మార్చి 17, (న్యూస్ పల్స్)మాట రేట్లు దారుణంగా పడిపోవడంతో.. ఓ రైతు కీలక నిర్ణయం తీసుకున్నాడు. టమాటా పంటను మార్కెట్‌కు తీసుకురాగా.. అక్కడ గిట్టుబాటు ధర లేకపోవడంతో.. అక్కడికి వచ్చిన ప్రజలకు ఉచితంగా తన టమాట పంటను మొత్తం పంచిపెట్టాడు. ఫ్రీగా టమాటలు ఇస్తున్నారనే విషయం తెలియడంతో స్థానికులు ఒక్కసారిగా ఎగబడ్డారు. పండించిన పంటకు ధర లేకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరికొందరు రైతులు టమాటలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు.ప్రస్తుతం టమాటకు ధర లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారీగా పెట్టుబడి పెట్టి టమాట పంటను పండించి.. కోసి మార్కెట్‌కు తీసుకువస్తే.. కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. వినియోగదారులకు మాత్రం టమాట అంత తక్కువ ధరకు దొరకడం లేదు. మధ్యలో ఉన్న దళారులే టమాటపై భారీగా లాభాలు పొందుతున్నారు. అటు రైతులు, ఇటు వినియోగదారులకు లాభాలు లేకుండా.. దళారులే కొట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు.. టమాటను మార్కెట్‌కు తీసుకువచ్చి ధర లేక పారబోయడం, కనీసం మార్కెట్ ఖర్చులు కూడా రాకుండా బాధపడటం చూస్తూనే ఉన్నాం.ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ రైతు.. తాను పండించిన టమాట పంటను తీసుకుని మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మార్కెట్‌కు వచ్చాడు. అయితే కిలో టమాటకు దళారులు కేవలం రూ.5 మాత్రమే చెల్లిస్తుండడంతో తీవ్ర అసహనానికి గురయ్యాడు. కొత్తగూడలో సంత కావడంతో గూడూరు మండలం భూపతిపేట గ్రామానికి చెందిన ఒక రైతు ఆటోలో టమాటాలను తీసుకొచ్చాడు. అయితే టమాట పంటను కొనుగోలు చేసేందుకు అక్కడ వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు.దీంతో తమ గ్రామం నుంచి అంతదూరం ఆటోలో టమాట పంటను తీసుకొచ్చిన ఆ రైతు.. మళ్లీ తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక అక్కడే ఉచితంగా పంచిపెట్టాడు. తాను తీసుకొచ్చిన ఆటోలో టమాటాలను ఓపెన్ చేసి.. అక్కడికి వచ్చిన వారికి ఫ్రీగా ఇచ్చేశాడు. దీంతో ఫ్రీగా టమాటాలు వస్తుండటంతో స్థానికులు భారీగా ఎగబడ్డారు.ప్రస్తుతం మార్కెట్‌లో టమాటలకు ధర లేకపోవడంతో టమాట పండించిన రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పెట్టిన పెట్టుబడి పక్కన పెడితే.. కనీసం వాటిని తెంచడానికి అయిన కూలీల ఖర్చు, మార్కెట్‌కు తీసుకొచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని.. తమ చేతి నుంచే ఎదురు ఖర్చులు చేయాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో టమాటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు వేడుకుంటున్నారు.మరికొందరు రైతులు టమాట పండినా.. ధర లేకపోవడంతో.. వాటిని తెంపితే కూలీల ఖర్చు అవుతుందని.. వాటిని అమ్మినా ఆ ఖర్చులు కూడా రావని భావించి.. పొలాల్లోనే అలాగే వదిలేస్తున్నారు. మరికొందరు రైతులు పశువులకు మేతగా టమాటలను వేస్తున్నారు. ఇంకొందరు రైతులు.. తమ పొలాల్లోకి వచ్చి ఎవరైనా ఫ్రీగా కోసుకుని వెళ్లొచ్చని ఆఫర్లు ఇస్తున్నారు. వేలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి టమాట పంటను సాగుచేస్తే.. పంట చేతికి వచ్చిన తర్వాత రేటు దారుణంగా పడిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. బయట కూరగాయల మార్కెట్లో మాత్రం వినియోగదారులకు కిలో టమాటా రూ.20 కి తక్కువకు దొరకకపోవడం గమనార్హం.



# తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టు..

## ఏడాదిలోగా అందుబాటులోకి, చురుగ్గా పనులు

వరంగల్, మార్చి 17, (న్యూస్ పల్స్)వరంగల్ నగర ప్రజలకు గుడ్‌న్యూస్. త్వరలోనే మామునూరు ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. ఎయిర్ కనెక్టివిటీ కోసం హైదరాబాద్ రావాల్సిన పని లేకుండా నగరం నుంచే రాకపోకలు సాగించొచ్చు. ఈ మేరకు ఎయిర్‌పోర్టు డీపీఆర్ సిద్ధం కాగా.. త్వరలోనే కేంద్రం ఆమోదముద్ర వేయనుంది. ఆ తర్వాత ఏడాదిలోగా ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తు?న్నారు.తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఒక్కటే పౌరులకు సేవలందిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీ పెంచాలనే లక్ష్యంతో కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు ప్రతిపాదించారు. వరంగల్ మామునూరు, రామగుండం, పెద్దపల్లి, కొత్తగూడెంలలో కొత్తగా ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ఇందులో వరంగల్ మామునూరు విమానాశ్రయం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏడాదిలోగా అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు పనులు జరుగుతున్నాయి.ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు డీపీఆర్ సిద్ధంగా కాగా.. అది కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కొద్ది రోజుల్లోనే డీపీఆర్‌కు ఆమోదం లభించే ఛాన్స్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆపై ఏడాదిలో పనులు పూర్తి చేసి ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తెచ్చేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రణాళికలు రెడీ చేస్తోంది. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి పెద్ద పెద్ద విమానాలు ఈజీగా ల్యాండ్ అయ్యేలా రన్‌వేను మూడు కి.మీ.మేర పొడిగిస్తారు. ప్రయాణికుల టెర్మినల్, కార్గో సౌకర్యం, సెక్యూరిటీ వ్యవస్థలు, పార్కింగ్, అనుసంధాన మార్గాలు వంటివి ఎయిర్‌పోర్టులో నిర్మిస్తారు. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది. సుమారు 950 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం కేటాయించారు. ఈ భూమికి అదనంగా మరో 253 ఎకరాలు సేకరించి ఎయిర్‌పోర్టు అథారిటీకి అప్పగించారు.మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రస్తుతం చిన్న ఎయిర్‌స్ట్రిప్‌గా ఉంది. దీన్ని పూర్తిస్థాయి కమర్షియల్

ఎయిర్‌పోర్ట్‌గా మార్చడంతో వరంగల్ ప్రాంతం అభివృద్ధిలో దూసుకెళ్లనుందని నిపుణులు చెబుతున్నారు. ఎయిర్ కనెక్టివిటీ కోసం హైదరాబాద్ నగరం వెళ్లాల్సిన లేకుండా ఇక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరుకోవచ్చునని అంటున్నారు. పరిశ్రమలు, ఐటీ కంపెనీలు వరంగల్ నగరానికి క్యూ కడతాయని చెబుతున్నారు. టూరిజం పెరుగుతుందని.. రామప్ప ఆలయం, వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట వంటి ప్రదేశాలు సందర్శించే విదేశీ పర్యాటకులు పెరుగుతారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మొదట చిన్న, మధ్యస్థాయి విమానాలతో రాకపోకలు ప్రారంభిస్తారని.. ఆ తర్వాత రోజుకు 1-2 విమానాలు రాకపోకలు సాగిస్తాయని అంటున్నారు. ప్రధానం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై వంటి నగరాలకు కనెక్టివిటీ పెరుగుతుందని చెబుతున్నారు.

# అధికార పార్టీకి దొరికిన అస్త్రం...

రంగారెడ్డి, మార్చి 17, (న్యూస్ పల్స్) డ్రగ్స్ కేసు రాజకీయ పేలుళ్లకు కారణం అవుతోంది. ఏపీలో ఎంపీ మహేష్ ను పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని టీడీపీ ఆదేశించింది. వెంటనే చర్యలు తీసుకుంది. అయితే పైలట్ రోహిత్ రెడ్డి విషయంలో బీఆర్ఎస్ ఆలోచిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ వెంటనే కేటీఆర్ ను టార్గెట్ చేసింది. ఆయనతో వైట్ చాలెంజ్ విసురుతోంది. కేటీఆర్ కూడా రివర్స్ చాలెంజ్ విసిరారు. అసెంబ్లీ సమాశాల్లోనూ ఇది హాట్ టాపిక్ అయ్యే అవకాశం ఉంది. గతంలోనూ డ్రగ్స్ అంశం రాజకీయంగా కీలకంగా మారింది. ఇప్పుడు మరోసారి అదే అంశం హాట్ టాపిక్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. మొయినాబాద్ డ్రగ్స్ ఉదంతం కేవలం ఒక క్రైమ్ ఇన్సిడెంట్‌గా మిగిలిపోకుండా, తెలుగు రాష్ట్రాల్లో పెను రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో వెలుగులోకి వచ్చిన పేర్లు, ఆపై జరిగిన పరిణామాలు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి కేంద్రబిందువుగా మారాయి. డ్రగ్స్ కేసును అస్త్రంగా చేసుకుని రాజకీయంగా పైచేయి సాధించేందుకు అటు ఏపీలోనూ, ఇటు తెలంగాణలోనూ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ కేసు ప్రకంపనలు రాగానే టీడీపీ అధిష్ఠానం అత్యంత వేగంగా స్పందించడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌ను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది తప్పు ఎవరిదైనా సరే, క్రమశిక్షణ విషయంలో రాజీ పడబోం అనే సంకేతాలను ప్రజల్లోకి పంపడం ద్వారా ప్రభుత్వం నైతిక విజయాన్ని సాధించే ప్రయత్నం చేస్తోంది. అధికారంలో ఉన్న పార్టీగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ద్వారా విపక్షాల నోళ్లు నొక్కేయవచ్చని టీడీపీ భావిస్తోంది.తెలంగాణలో పరిస్థితి మరోలా ఉంది. ఫామ్‌హౌస్ పార్టీలో రోహిత్ రెడ్డి పేరు వినిపించడం బీఆర్ఎస్‌ను ఇరకాటంలోకి నెట్టింది. పార్టీకి కీలక నేత కావడంతో బీఆర్ఎస్ అధిష్ఠానం చర్యల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. గతంలోనూ పలుమార్లు డ్రగ్స్ ఇష్యూస్ బీఆర్ఎస్ నేతల చుట్టూ తిరిగినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రోహిత్ రెడ్డి విషయంలో వేచి చూసే ధోరణి అవలంబించడం వల్ల ప్రతిపక్షాలకు విమర్శలు చేసేందుకు అవకాశం ఇచ్చినట్లయింది. తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్ ఈ అవకాశాన్ని అస్సలు వదులుకోవడం లేదు. గతంలో రేవంత్ రెడ్డి విసిరిన వైట్ ఛాలెంజ్ ను ఇప్పుడు మళ్ళీ తెరపైకి తెచ్చారు. కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ నేతలు డ్రగ్స్ టెస్టులకు సిద్ధమా అని సవాల్ విసురుతున్నారు. దీనికి ప్రతిగా కేటీఆర్ కూడా రివర్స్ ఛాలెంజ్ విసరడం, నాటి కేసుల ప్రస్తావన తీసుకురావడంతో రాజకీయం మరింత హీటెక్కింది. రాష్ట్రంలో డ్రగ్ ఫ్రీ తెలంగాణ నినాదాన్ని వినిపిస్తున్న కాంగ్రెస్, ఈ కేసు ద్వారా బీఆర్ఎస్ ముసుగు తొలగిస్తామన్నట్లుగా వ్యవహరిస్తోంది.తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ డ్రగ్స్ ఇష్యూ ప్రధాన అస్త్రంగా మారే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు డ్రగ్స్ పార్టీల్లో పాల్గొనడం, అందులో గన్ కల్చర్ చోటుచేసుకోవడం వంటి అంశాలపై ప్రభుత్వం గట్టిగా నిలదీసేలా కనిపిస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వంటి వారు ప్రతి 90 రోజులకు ఒకసారి టెస్టులు చేయాలనే ప్రతిపాదనలు తేవడం ఈ చర్చను మరింత ముందుకు తీసుకెళ్లేలా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ అంశం రాజకీయంగా కీలకం కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో జరిగిన టాలీవుడ్ డ్రగ్స్ కేసు, కొకైన్ స్కామ్స్ ఎన్నికల సమయంలో ఎంతో ప్రభావం చూపాయి. ఇప్పుడు మొయినాబాద్ కేసు ద్వారా మరోసారి అదే తరహా సెన్సేషన్ మొదలైంది. ఇది కేవలం ఒక పార్టీకే పరిమితం కాకుండా, అందరి చుట్టూ తిరుగుతుండటంతో రాబోయే రోజుల్లో రాజకీయ సమీకరణలు ఏ మలుపు తిరుగుతాయోనన్న ఆసక్తి నెలకొంది

# స్లిమ్ గా కావాలని చూస్తున్నారా? అయితే కొబ్బరినూనె మ్యాజిక్ ట్రై చెయ్యండి!



ఆరోగ్యంగా ఉండాలని ఎవరి కోరుకోరు? ఈ భూమి మీద ఉన్న ప్రతి ఒక్కరు ఆరోగ్యంగాను, అందంగా ఉండాలని కోరుకుంటారు. అంతేకాదు నాజుగ్గా ఉండాలని కూడా కోరుకుంటారు. అటువంటివారు బరువు తగ్గడం కోసం ఎన్నెన్నో చేస్తూ ఉంటారు. జిమ్ కు వెళ్లడం, డైట్ ఫాలో అవ్వడం ఇలా ఎన్ని చేసినప్పటికీ మంచి ఫలితం రాదు అటువంటివారు కొబ్బరినూనె మీ శరీరంపైన బరువు తగ్గడం కోసం చేసే మ్యాజిక్ తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు. కొబ్బరినూనెలో ఫుల్ పోషకాలు కొబ్బరి నూనెలో చాలా పోషకాలు ఉంటాయి. కొబ్బరి నూనె శరీరానికి కావలసిన ఎన్నో మంచి గుణాలతో సమ్మిళితమై ఉంటుంది. కొబ్బరి నూనెలో మోనో అన్సాచ్యురేటెడ్ కొవ్వు ఆమ్లాలు చాలా ఉంటాయి. ఇవి ఆహారంలో అదనపు కొలెస్ట్రాల్ ను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. సహజంగా కొబ్బరి నూనె జుట్టు ఆరోగ్యానికి మాత్రమే ఉపయోగిస్తారు కానీ వంటకు కొబ్బరి నూనెను ఉపయోగించడం ఎంతో మంచిది. బరువు తగ్గాలంటే కొబ్బరి నూనె ఇలా తీసుకోవాలి చాలా ఆరోగ్యకరమైన కొబ్బరి నూనె వినియోగం వల్ల బరువు బాగా తగ్గే అవకాశం ఉంటుంది. కొబ్బరి నూనెను పరగడుపున తీసుకుంటే నెలరోజుల్లో మీ శరీరంలో చాలా మంచి మార్పు వస్తుంది. కొబ్బరినూనె బొద్దు కొవ్వును తగ్గిస్తుందని చెప్తారు.బరువు తగ్గాలనుకునేవారు కొబ్బరినూనెను ఏ విధంగా తీసుకోవాలి అంటే ఖాళీ కడుపుతో ప్రతిరోజు ఒక టీ స్పూన్ కొబ్బరి నూనె తాగడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. కొబ్బరి నూనెతో చర్మం కాంతివంతం కొవ్వు త్వరగా తగ్గుతుంది. గోరువెచ్చని నీటిలో ఒక స్పూన్ కొబ్బరినూనె కలుపుకుని తాగినా మంచి ప్రయోజనం ఉంటుంది. దీనిని ప్రతిరోజు కచ్చితంగా పాటించటం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొవ్వు నుండి విముక్తి లభిస్తుంది. ఒకే నెలలో మూడు కిలోల వరకు బరువు తగ్గడానికి అవకాశం ఉంటుంది. కొబ్బరినూనె మన చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. కొబ్బరినూనె ఇలా తీసుకున్నా లాభమే మనం తినే ఆహారంలో ఉండే చెడు కొవ్వులు మన శరీరంలో పేరుకుపోయి బరువు పెరగడానికి కారణమవుతాయి. అయితే కొబ్బరి నూనెలో ఉండే ట్రై గ్లిజరైడ్స్ ఇతర కొవ్వుల కంటే ఆరోగ్యకరంగా ఉంటాయి. ఇక కొబ్బరి నూనెను తేనెతో కలిపి రోజుకు మూడు నాలుగు సార్లు తీసుకోవడం కూడా ప్రయోజనం ఇస్తుంది.

# తరచూ శుభ్రం చేయకూడని శరీరభాగాలివే!

ప్రతి ఒక్కరు శుభ్రంగా ఉండాలి. అయితే శుభ్రత పేరుతో పొద్దుకు పది సార్లు స్నానం చేసేవారు ఉంటారు. ఇది ఏమాత్రం మంచిది కాదని చెబుతున్నారు వైద్యనిపుణులు. మన శరీరంలో కొన్ని భాగాలను ఎక్కువగా శుభ్రం చేయకూడదని, వాటికి ఎక్కువగా శుభ్రం చేయడం వల్ల అనేక అనారోగ్యసమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని, ఆయా శరీరభాగాల సెన్సిటివిటీ పెరుగుతుందని చెబుతున్నారు. మరి ఎటువంటి శరీరభాగాలను ఎక్కువ శుభ్రం చేయకూడదనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ముఖాన్ని పదేపదే కడుగుతున్నారా? చాలామంది ముఖం తెల్లగా ఉండాలని, నిగారింపును సొంతం చేసుకోవాలని పదేపదే ముఖాన్ని సబ్బుతో రుద్దుతూ కడుగుతూ ఉంటారు. ఇలా ముఖాన్ని పదేపదే శుభ్రం చేయడం మంచిది కాదు. రోజుకు రెండు సార్లు ముఖం కడుక్కుంటే సరిపోతుంది కానీ తరచూ ముఖాన్ని స్క్రబ్ చేయడం వల్ల ధర్మంలో ఉన్న సహజ నూనెలు తొలగిపోయి ముఖం అందవిహీనంగా తయారవుతుంది. కనుక ముఖాన్ని పదేపదే ఎక్కువసార్లు రుద్ది శుభ్రం చేయకండి.“ ఈ శరీర భాగాన్ని ఎక్కువ శుభ్రం చేస్తే జరిగేదిదే ఇక ముక్కు లోపలి భాగాన్ని కూడా మనం ఎక్కువసార్లు శుభ్రం చేయకూడదు. ముక్కు లోపలి భాగంలో గాలిని శుభ్రపరిచే తేమను అందించే ఒక పొర ఉంటుంది. దీనిని ఊరికే ఎక్కువసేపు నీళ్లతో శుభ్రం చేస్తే ఈ పొర దెబ్బతిని, శుభ్ర పరిచే ఫిల్టర్ దెబ్బ తింటుంది. దీనివల్ల గాలిలో ఉన్న దుమ్ము చూడు ఈజీగా లోపలికి వెళుతుంది. ఈ శరీర భాగం విషయంలో జాగ్రత్త ఇక ఎక్కువగా శుభ్రం చేయకూడని శరీర భాగాలలో జననేంద్రియాలు కూడా ఒకటి. ఇవి చాలా సున్నితంగా ఉంటాయి. ఎక్కువసేపు సబ్బుతో రుద్దుతూ, నీళ్లతో తరచూ శుభ్రం చేస్తే దానికి ఉండే పీహెచ్ స్థాయిలు దెబ్బతింటాయి. సాధారణంగా ఒకటి రెండుసార్లు జననేంద్రియాలను శుభ్రం చేసుకోవచ్చు. కానీ పదే పదే సబ్బు రుద్దుతూ జననేంద్రియాలను శుభ్రం చేయడం మంచిది కాదు.ఎక్కువ శుభ్రం చేయకూడని శరీర భాగాలివే చాలామంది పాదాల మధ్య భాగంలోనూ, కంటి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని తరచూ శుభ్రం చేస్తూ ఉంటారు. ఇలా శుభ్రం చేయడం కూడా మంచిది కాదు. కంటి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ఎక్కువసేపు నీటితో శుభ్రం చేస్తే ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది పాదాల మధ్య భాగం కూడా చాలా సున్నితంగా ఉంటుంది. దానిని కూడా ఎక్కువసేపు రుద్దుతూ శుభ్రం చేయకూడదు. ఎక్కువసేపు రుద్దితే మురికి పోతుందని అనుకుంటే అది పొరపాటు. శరీరంలోని భాగాలను వాటి సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకుని మాత్రమే శుభ్రం చేసుకోవాలి.



# అందంతో పాటు ఆరోగ్యం కావాలంటే ఈ జ్యూస్ తాగండి!



సహజంగా ఆకుకూరల్లో లభించే పోషకాలు, మిటమిన్లు ఇతర ఏ కూరగాయల్లోనూ అంతగా లభించవు. ఆకు కూరలు తినడం ఆరోగ్యానికి మంచిది అని డాక్టర్లు చెబుతుంటారు..మరి అవే ఆకు కూరలను జ్యూస్ చేసుకొని తాగితే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఆకుకూరలలో పాలకూరకు ఒక ముఖ్యమైన స్థానం ఉంది. పాలకూర పుష్కలంగా పోషకాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తుంది. పాలకూర జ్యూస్ తో ఈ సమస్యలకు చెక్ పాలకూరను జ్యూస్ చేసుకొని తాగడం వలన మనకు పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్లు కావలసినన్ని లభిస్తాయి.. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడతాయి ,చర్మం పొడిబారకుండా ,ముడతలు రాకుండా కాపాడతాయి. పాలకూరలో మిటమిన్ ఏ కంటి చూపు సమస్య ఉన్నవారికి, రే చీకటితో బాధపడేవారికి ఉపయోగపడుతుంది . కాబట్టి పాలకూర జ్యూస్ తాగడం వలన ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చు. పాలకూర జ్యూస్ తో హైబీపీ నియంత్రణ పుట్టిన పసి పిల్లలకు పాలిచ్చే తల్లులకు పాల ఉత్పత్తి పెరగడం కోసం పాలకూర జ్యూస్ తాగితే ప్రయోజనం ఉంటుంది. పాలకూర జ్యూస్ వలన పాల ఉత్పత్తి పెరుగుతుంది.. పాలకూర జ్యూస్ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందడమే కాకుండా రక్తపోటు సమస్యతో బాధపడేవారికి ఉపశమనం కలుగుతుంది. పాలకూరలో పొటాషియం, మెగ్నీషియం , ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి . ఇది హైపర్ టెన్షన్ ను తగ్గిస్తుంది గుండె ఆరోగ్యానికి పాలకూర జ్యూస్ మెదడు పనితీరుని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని అరికడుతుంది. కాలేయ వ్యాధులను దూరం చేస్తుంది. మలబద్దక సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది.పాలకూర జ్యూస్ ను డైలీ కాకపోయిన్ వారంలో ఒకటి రెండు సార్లు తాగితే క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ముందుగానే జాగ్రత్త పడొచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు. పాలకూర జ్యూస్ తాగటం గుండె సంబంధిత వ్యాధుల నుండి విముక్తి కలిగిస్తుంది. పాలకూర జ్యూస్ తో అందం, ఆరోగ్యం పాలకూర జ్యూస్ తో చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జుట్టుకు బలం చేకూరుతుంది. జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.త్వరగా వృద్ధాప్య ఛాయలు రాకుండా ఉంటాయి. పాలకూర జ్యూస్ మన చర్మం ముడతలు రాకుండా చేస్తుంది.అందం, ఆరోగ్యం రెండింటినీ ఇచ్చే పాలకూరను జ్యూస్ రూపంలోనూ, స్మూతీ రూపంలోనూ చేసుకుని తీసుకుంటే మంచిది.

# బియ్యం తింటున్నారా? ఇది తెలిస్తే అస్సలే తినరు!



చాలామందికి బియ్యం తినే అలవాటు ఉంటుంది. ఇంట్లో ఎన్ని తినే ఆహార పదార్థాలు ఉన్నప్పటికీ వారి మనసు బియ్యం మీదనే పోతూ ఉంటుంది. అటు ఇటు తిరుగుతూ కాసిన్ని బియ్యాన్ని నోట్లో వేసుకుని తింటూ ఉంటారు. కానీ ఇళ్లల్లో పెద్దవాళ్లు బియ్యం తినకూడదని పదేపదే చెబుతారు. అయితే ఈ విధంగా బియ్యాన్ని తినడం వల్ల ఏం జరుగుతుంది? బియ్యం తినే అలవాటు ఈ లోపంతోనే ఎందుకు మన పెద్దవాళ్లు బియ్యం తినకూడదని పదే పదే చెబుతారు? అసలు వద్దన్నా వాళ్ళు బియ్యం ఎందుకు తింటారు? అనేది ప్రస్తుతం తెలుసుకుందాం. చాలామందిలో ఎవరు వద్దన్నా సరే బియ్యం తిని అలవాటు ఉంటుంది. పోషకాహార లోపం వల్లే ఈ సమస్య ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఐరన్ డెఫిషియన్సీ వల్ల, విటమిన్ బి12 శరీరంలో తక్కువగా ఉండడం వల్ల బియ్యాన్ని తినాలని చాలామంది ఫీల్ అవుతూ ఉంటారు “మజ్జిగన్నంలో పచ్చి ఉల్లిపాయ తింటున్నారా? ఇది తెలుసుకోండి” బియ్యాన్ని నేరుగా తింటే జరిగేదిదే బియ్యంలో మన శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాలు, క్యాల్షియం, ఫైబర్, ఐరన్, థియామిన్, రిబో ఫ్లేవిన్ తో సహా ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. అయితే బియ్యాన్ని పచ్చిగా తింటే మాత్రం అది ఏమాత్రం మనకు ఆరోగ్యాన్ని ఇవ్వదు. వండుకోకుండా బియ్యాన్ని నేరుగా తింటే ఎన్నో వ్యాధుల బారిన పడాల్సి వస్తుంది. వండుకోకుండా బియ్యాన్ని తినడం వల్ల జీర్ణ సమస్య వస్తుంది. బియ్యం తినే వారిలో ఈ అనారోగ్య సమస్యలు కడుపునొప్పితో బాధపడాల్సి వస్తుంది. బియ్యాన్ని నేరుగా తినడం వల్ల శారీరకంగా అలసట, బలహీనత వంటి సమస్యలు వస్తాయి. బియ్యం లో లెక్టిన్ అనే మూలకం ఎక్కువ మొత్తంలో ఉండడం వల్ల ఇది కడుపు ఉబ్బరాన్ని, మలబద్ధకాన్ని, కడుపునొప్పి వంటి సమస్యలను కలిగిస్తుంది. బియ్యం ప్రేగు కదలికలలో ఇబ్బందిని కలిగిస్తుంది. బియ్యాన్ని నేరుగా తినడం వల్ల మూత్రపిండాల సమస్యలు వస్తాయి.ఉనీజూజీశ్రీ ఎజీతీఎజీ: రామ్ గోపాల్ వర్మకు మూడు నెలల జైలు శిక్ష..! 5 5 నీరసం, రక్త హీనత సమస్యలతో ఇబ్బంది బియ్యం సులభంగా జీర్ణం కాదు కాబట్టి వీటిని తింటే వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం కూడా ఉంది..ఇక వీరు బియ్యం తినడం వల్ల రక్తంలోని తెల్ల రక్త కణాలు చనిపోతాయి. ముఖం పాలిపోతుంది. ఎప్పుడూ నీరసంగా డల్ గా తయారవుతారు. బియ్యం తినేవారిలో ఉత్సాహం లోపిస్తుంది. రక్తహీనత సమస్య వస్తుంది.

# రాత్రిపూట భోజనం చేయకుండా టిఫిన్ తింటున్నారా? ఇది తెలుసుకోండి!

ప్రస్తుత రోజుల్లో భోజనం చేయడాన్ని చాలామంది తగ్గించే స్తున్నారు. బిర్యానీలు అందుబా టులోకి వచ్చిన తర్వాత సమయవేళలు లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు బిర్యానీలు.. అందులోను మాంసాహార బిర్యానీలు లాంగించేసి అనారోగ్యాలకు గురవుతున్నారు. కొంతమంది సమయం లేదని, మరికొందరు డైటింగ్ అంటూ రాత్రిపూట భోజనం మానేసి టిఫిన్ తింటుంటారు. ఆరోగ్య పరంగా ఇది చాలా క్లిష్టమైన విషయం. దీనివల్ల ప్రయోజనాలేమిటి? నష్టాలేమిటి? అనే విషయాలను తెలుసుకుందాం. భోజనం మానేయడంవల్ల కలిగే లాభాలు బరువు తగ్గడానికి సహాయపడుతుంది... రాత్రిపూట తినే ఆహారం సాధారణంగా జీర్ణం కాకుండా కొవ్వుగా మారిపోతుంది. అందుకే రాత్రి భోజనం మానేయడం వల్ల కొంతమేర బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మెరుగైన నిద్ర... రాత్రి భోజనం చేయకుండా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థ పనిభారం తగ్గుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది...“ప్రతిరోజు సబ్బుతోనే స్నానం చేస్తున్నారా?... ఇది తెలుసుకోండి!” రాత్రిపూట భోజనం మానేయడం వల్ల కలిగే నష్టాలు శక్తి లేకపోవడం... రోజంతా పనిచేసిన తర్వాత శరీరానికి శక్తి అవసరం. రాత్రి భోజనం మానేస్తే శరీరానికి కావాల్సిన శక్తి లభించదు.



దీంతో మరుసటి రోజు ఉదయం నీరసంగా అనిపించవచ్చు. జీర్ణ సమస్యలు... రాత్రిపూట భోజనం మానేస్తే అజీర్తి, ఆమ్లం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పోషకాల లోపం... రాత్రి భోజనంలో అవసరమైన పోషకాలు లభించకపోతే శరీరానికి పోషకాల లోపం ఏర్పడుతుంది. రాత్రిపూట తేలికపాటి టిఫిన్ తీసుకోవడం మంచిది. ఏమేం తినాలి.. ఏమేం తినకూడదంటే ఒక గ్లాస్ పాలు తాగాలి. గుడ్డు తింటే మంచిది. మొక్కజొన్న, ఫ్రూట్ సలాడ్, మొక్కజొన్న రొట్టె లాంటివి తినొచ్చు. కారంగా ఉన్న ఆహారం, ఎక్కువగా నూనె వాడిన ఆహారం, మసాలా ఆహారం, చక్కెర అధికంగా ఉన్న ఆహారం తీసుకోకూడదు. రాత్రి 7.00 గంటల తర్వాత తినడం మంచిది కాదు. తక్కువ పరిమాణంలో తినడంతోపాటు త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తినాలి. రాత్రిపూట భోజనం చేయడం లేదా మానేయడం అనేది వ్యక్తిగత నిర్ణయం.

## ఆశావహుల వ్యూహం - ప్రతిపక్షాల లీకులు

విజయవాడ, మార్చి 17, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా సెగలు పుట్టిస్తున్న కేబినెట్ విస్తరణ వార్తలపై స్పష్టత వస్తోంది. సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ప్రచారానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదని ...చంద్రబాబు మార్క్ రాజకీయం తెలిసిన ఎవరైనా.. ఈ తరుణంలో మంత్రివర్గ మార్పులు సాధ్యం కాదని అంచనా వేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల మధ్య రాష్ట్రాన్ని నడుపుతున్నారు. అమరావతి నిర్మాణానికి నిధుల సమీకరణ, పోలవరం పనుల పునరుద్ధరణ వంటి భారీ లక్ష్యాలు ఆయన ముందున్నాయి. ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు కూడా పూర్తికాకముందే మంత్రివర్గంలో మార్పులు చేస్తే, అది అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పాలనాపరమైన అయోమయానికి దారితీస్తుంది. అందుకే, ప్రస్తుతం తన ఫోకస్ అంతా మిషన్ బిల్డ్ ఏపీ పైనే తప్ప, రాజకీయ పదవుల పంపకంపై లేదని ఆయన స్పష్టమైన సంకేతాలిస్తున్నారు.సాధారణంగా చంద్రబాబు మంత్రులకు తనదైన శైలిలో రిపోర్ట్ కార్డ్స్ ఇస్తుంటారు. ప్రస్తుతం ఉన్న మంత్రులు తమ శాఖలపై పట్టు సాధించి, క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపడానికి కనీసం రెండేళ్ల సమయం ఇవ్వాలని ఆయన భావిస్తున్నారు. అప్పుడే ఎవరు సమర్థులు, ఎవరు విఫలమయ్యారనేది స్పష్టమవుతుంది. ఇప్పుడున్న మంత్రుల పనితీరును ర్యాంకింగ్‌ల ద్వారా పర్యవేక్షిస్తున్న సీఎం, ఇప్పుడే మార్పులు చేసి వారిలో నిరాశ నింపడం కంటే, వారిని మరింత ఉత్సాహపరిచి పని చేయించుకోవడమే ఉత్తమమని భావిస్తున్నారు.మంత్రివర్గ విస్తరణ వార్తలు పుట్టడానికి రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, పదవులు ఆశిస్తున్న సీనియర్ ఎమ్మెల్యేలు తమ పేర్లను చర్చల్లో ఉంచడం ద్వారా అధిష్టానంపై ఒత్తిడి పెంచాలని చూడటం. రెండు, కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నాయని చూపేందుకు ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా ఇటువంటి లీకులను వదిలి ఉండవచ్చు. అయితే, పవన్ కళ్యాణ్ , చంద్రబాబు మధ్య ఉన్న దృఢమైన సమన్వయం దృష్ట్యా, ఇటువంటి ప్రచారాలు కూటమిపై పెద్దగా ప్రభావం చూపడం లేదని భావిస్తున్నారు. ప్రభుత్వానికి ఇప్పుడు అతిపెద్ద సవాలు సూపర్ సిక్స్ హామీల అమలు. ఉగాది నాటికి ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణ పనుల్లో వేగం పెంచడంపై సీఎం సీరియస్ డెడ్ లైన్లు విధించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, రాజకీయ సమీకరణాల కోసం పదవులు పంచుకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని చంద్రబాబుకు తెలుసని అంటున్నారు. రాజకీయాల కంటే ప్రజా సేవ అన్న నినాదంతోనే ముందుకు వెళ్లాలని ఆయన తన కేబినెట్ సహచరులకు సైతం దిశానిర్దేశం చేస్తున్నారు. ఉగాది నాటికి మంత్రి పదవులు దక్కుతాయని ఎదురుచూస్తున్న ఆశావహులకు నిరాశే మిగిలేలా ఉంది. రాజకీయ అవసరాల కంటే పాలనాపరమైన అవసరాలకే చంద్రబాబు పెద్దపీట వేస్తారు. ప్రస్తుతం ఉన్న మంత్రులందరూ తమ స్థానాల్లో సురక్షితంగా ఉన్నారని, కేబినెట్ విస్తరణ అనేది ప్రస్తుతానికి అజెండాలోనే లేని అంశమని స్పష్టమవుతోందని అనుకోవచ్చు.

## వారసత్వ స్థలాల రిజిస్ట్రేషన్ మరింత

### జస్ట్ ఇలా చేస్తే చాలు..!

విజయవాడ, మార్చి 17, కొత్త మార్గదర్శకాలతో ఇకపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన బాధ ఉండదు. నేరుగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునే వెసులుబాటు కలిగింది.వారసత్వంగా లభించే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారసత్వంగా లభించే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ను మరింత ఈజీ చేసింది. వారసత్వంగా లభించే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం కొత్త గైడ్ లైన్స్ రిలీజ్ చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ఇకపై గ్రామాల్లోని వారసత్వంగా లభించే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ శాఖ సర్టిఫికెట్ అవసరం లేదు. స్థలం యజమానుల సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే చాలు. తమకు పూర్వీకుల నుంచే ఆస్తి వచ్చిందని, నిషేధిత జాబితా(22ం)లో లేదని, తామే పూర్తి హక్కుదారు అని అందులో స్పష్టంగా పేర్కొనాలి. అయితే, ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. ఒకవేళ తప్పుడు సమాచారం ఇస్తే కనుక కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది.ఇటువంటి ఆస్తుల బదలాయింపు పెద్ద ప్రహసనంగా ఉండేది. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన వ్యవసాయేతర భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు హక్కు ఉన్నట్లు యజమానుల దగ్గర ఎలాంటి ఆధారాలు ఉండవు. దీంతో భవిష్యత్తులో సమస్యలు రాకుండా రెవెన్యూ శాఖ నుంచి యాజమాన్య హక్కు ఉన్నట్లుగా ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని రిజిస్ట్రార్లు అడుగుతున్నారు. అయితే రెవెన్యూ శాఖ నుంచి సర్టిఫికెట్ తీసుకోవడం సామాన్యులకు పెను భారం అవుతోంది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ రిజిస్ట్రేషన్ నిబంధనలను సవరించింది ప్రభుత్వం. కొత్త మార్గదర్శకాలతో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పాత ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్లు జాప్యం లేకుండా వేగంగా పూర్తి కానున్నాయి.వారసత్వ ఆస్తుల నమోదు కోసం యజమానులు ఇచ్చే సెల్ఫ్ డిక్లరేషన్ పత్రాన్నే ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఆ ఆస్తి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిందని, దానిపై తమకు పూర్తి యాజమాన్య హక్కులు ఉన్నాయని యజమానులు లిఖితపూర్వకంగా ఇస్తే సరిపోతుంది. కొత్త మార్గదర్శకాలతో ఇకపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన బాధ ఉండదు. నేరుగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునే వెసులుబాటు కలిగింది. ప్రభుత్వ నిర్ణయంపై సామాన్య ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఈ సెల్ఫ్ డిక్లరేషన్‌కు సంబంధించి యజమానులు కొన్ని ముఖ్యమైన అంశాలను స్పష్టంగా పొందుపరచాలి. సంబంధిత స్థలం లేదా ఆస్తి ప్రభుత్వం ప్రకటించిన నిషేధిత జాబితా (సెక్షన్ 22ం)లో లేదని ధృవీకరించాలి. అంతేకాదు ఎలాంటి వివాదాలు లేని పూర్తి హక్కుదారు తామేనని డిక్లరేషన్‌లో పేర్కొనాలి. మరో ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. సెల్ఫ్ డిక్లరేషన్ పత్రంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చినా, వాస్తవాలను దాచి పెట్టినా వారిపై చట్టపరమైన చర్యలు (సివిల్, క్రిమినల్ కేసులు) తప్పవు.

## భార్యాభర్తల మధ్య ఘర్షణ

### భార్యకు కత్తిపోట్లు

### పోలీసులకు లొంగిపోయిన భర్త

యాదాద్రి భువనగిరి, ఆత్మకూరు మండల లకేంద్రంలో భార్యాభర్తల మధ్య గొడవ చెలరేగింది. భర్త మహేష్ పై భార్య దేవీ కత్తితో దాడి చేసింది. అదే కత్తితో భార్యపై భర్త పలుమార్లు దాడి చేసాడు. ఘటనలో భార్య దేవీ కి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను భువనగిరి ఏరియా హాస్పిటల్ తరలించారు, భర్త మహేష్ ఆత్మకూరు పోలీసు స్టేషన్ లో లొంగిపోయాడు.

# ఏపీలో ఇక ఆఫీసర్ల హవా

విజయవాడ, మార్చి 17, ఏపీలో ఇక ఆఫీసర్ల హవా.. లీడర్ల దారెటు? నగరాలు, పట్టణాల్లో రాజకీయం కొత్త టర్న్ తీసుకుంటుందా?రాష్ట్రంలో అధికారం మారిన పరిస్థితుల్లో లీడర్లు జంపింగ్‌లకు రెడీ అవుతున్న పరిస్థితి ఉంది. క్యాస్ట్ ఈక్వేషన్, ఆర్థిక, అంగ బలాన్ని లెక్కలేసుకుని పార్టీలు మారితే మళ్లీ పదవులు చేపట్టొచ్చని వలస పక్షుల ఆలోచనగా చెబుతున్నారు. పాలక వర్గాల గడువు ముగుస్తుంది. అధికారుల పాలన రానుంది. ఏపీలోని 86 నగర పంచాయతీలు, 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించింది ప్రభుత్వం. కొత్తగా కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఎన్నికై..పాలకవర్గాలు కొలువుదీరే వరకు మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్లు పాలనలో కొనసాగనుంది. దాదాపు 90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రత్యేకాధికారుల పాలన కిందకు వెళ్లిపోనున్నాయి. కార్పొరేషన్లకు ఐఏఎస్ స్థాయి ఆఫీసర్లను, మున్సిపాలిటీలకు ఆర్డీవో క్యాడర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది సర్కార్. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం కార్పొరేషన్లకు ఐఏఎస్ అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహంచనున్నారు. మళ్లీ ఎన్నికలు జరిగి మేయర్లు బాధ్యతలు స్వీకరించే వరకు వీరి ఆధ్వర్యంలో ఆయా నగరాల్లో పాలన వ్యవహారాలు కొనసాగనున్నాయి.మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో లీడర్లు కుర్చీలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోతున్నా ఇప్పటివరకు 90 శాతం మున్సిపాలిటీలు వైసీపీ నేతల చేతుల్లోనే ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన నేతలే మున్సిపల్ ఛైర్మన్లుగా, మేయర్లుగా కొనసాగుతున్నారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క తాడిపత్రి మినహా రాష్ట్రంలో మిగిలిన అన్నిచోట్ల వైసీపీనే పాగా వేసింది.అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొన్ని చోట్ల రాజకీయ పరిస్థితులు మారడం, కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించడంతో..పది పదిహేను మున్సిపాలిటీలను టీడీపీ కైవసం చేసుకుంది. అయినప్పటికీ ఇప్పటికీ మెజార్టీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వైసీపీ నేతలే ఛైర్మన్లు, మేయర్లుగా ఉన్నారు. పదవీ కాలం పూర్తి కావడంతో వాళ్లంతా మాజీలు అవుతున్నారు. దీంతో నగరాలు, పట్టణాల్లో పొలిటికల్ ఈక్వేషన్స్ మారుతున్నట్లు కనిపిస్తోంది.జూన్‌లోపు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే యోచనలో కూటమి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అప్పుడే పట్టణాల్లో రాజకీయ వేడి వేడెక్కుతోంది. ఇప్పటికే కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పని చేస్తున్న వాళ్లు బరిలోకి దిగేందుకు సిద్ధపడుతుండగా..కొత్తగా మరికొందరు లీడర్లు ఎన్నికల రంగంలోకి దిగేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో అధికారం మారిన పరిస్థితుల్లో లీడర్లు జంపింగ్‌లకు రెడీ అవుతున్న పరిస్థితి ఉంది. క్యాస్ట్ ఈక్వేషన్, ఆర్థిక, అంగ బలాన్ని లెక్కలేసుకుని పార్టీలు మారితే మళ్లీ పదవులు చేపట్టొచ్చని వలస పక్షుల ఆలోచనగా చెబుతున్నారు.కార్పొరేషన్లలో అయితే పొలిటికల్ హీట్ నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంటుంది. పలు చోట్ల ఇప్పటికే మేయర్ కుర్చీలు టీడీపీ ఖాతాలో ఉండగా..కడప లాంటి చోట వైసీపీ పట్టు కొనసాగిస్తోంది. దీంతో గతంలో వైసీపీ గెలిచినట్లు వార్ వన్ సైడే అన్నట్లుగా మున్సిపల్ ఎన్నికల్లో పాగా వేయాలని ప్లాన్ చేస్తోందట కూటమి. ఇదే అదునుగా పార్టీ మారాలనుకుంటున్న పలువురు లీడర్లు కూడా పావులు కదుపుతున్నట్లు ఇన్ సైడ్ టాక్. పురపోరు నాటికి లీడర్ల జంపింగ్‌లు, పొలిటికల్ ఈక్వేషన్లు ఎలా మారుతాయో? తాజా మాజీలు మళ్లీ ఎన్నికల బరిలో నిలుస్తారో లేదో? ఒకవేళ పోటీ చేసినా ఏ పార్టీ నుంచి ఎవరు బరిలోకి దిగుతారోనని లోకల్ పాలిటిక్స్ అప్పుడే వేడెక్కుతున్నాయి

## హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం

అమరావతి, మార్చి 17, ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం వేగం పుంజుకుంది. అమరావతి నిర్మాణంలో భాగంగా జీఏడీ, హెచ్‌ఓడీ టవర్లు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. జీఏడీ టవర్ 47 అంతస్థులతో, మిగతా నాలుగు హెచ్‌ఓడీ టవర్లను 40 అంతస్తులతో నిర్మిస్తున్నారు. డయాగ్రిడ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే టవర్ -1కు సంబంధించి మొదటి స్టీల్ డయాగ్రిడ్ అమర్చే పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మంత్రి నారాయణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. 2028 అక్టోబర్ నాటికల్లో టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులలో వేగం పెరిగింది. సోమవారం రోజున అమరావతిలోని హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో భాగంగా టవర్ -1కు మొదటి స్టీల్ డయాగ్రిడ్ అమర్చే పనులు ప్రారంభమయ్యాయి. ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ఈ పనులు ప్రారంభమయ్యాయి. అనంతరం విలేకర్లతో మాట్లాడిన మంత్రి నారాయణ .. అమరావతి రైతులకు చెప్పిన మాట ప్రకారమే రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అమరావతి జీఏడీ, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో భాగంగా డయాగ్రిడ్ టెక్నాలజీతో మొత్తం ఐదు టవర్లు నిర్మిస్తున్నట్లు నారాయణ వెల్లడించారు.47 అంతస్తులలో జీఏడీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. మిగతా టవర్లను 40 అంతస్తులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 53 లక్షల చదరపు అడుగుల బిల్ట్ ఏరియాతో టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. అన్ని కార్యాలయాలు, అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా ఈ టవర్లను డిజైన్ చేసినట్లు తెలిపారు. 2028 అక్టోబర్ నాటికి జీఏడీ, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.మరోవైపు మూడు ప్యాకేజీల కింద అమరావతిలో టవర్ల నిర్మాణం చేపడుతున్నారు. రూ.4,688.82 కోట్ల అంచనా వ్యయంతో వీటి నిర్మాణం చేపట్టారు. మొదటి ప్యాకేజీ కింద రూ.1,126.51 కోట్లతో జీఏడీ టవర్ నిర్మిస్తున్నారు. రెండో ప్యాకేజీ పనుల కింద 1,897.86 కోట్ల రూపాయలతో 1, 2 టవర్లు నిర్మించనున్నారు. మూడో ప్యాకేజీ పనుల కింద రూ.1,664.45 కోట్లతో మూడు, నాలుగో టవర్లు నిర్మించనున్నారు. ఈ ఐకానిక్ టవర్ల నిర్మాణం డయాగ్రిడ్ విధానంలో చేపట్టనున్నారు.టవర్లలో జీఏడీ టవర్ అన్నింటికంటే ఎత్తు ఉండనుంది. బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా జీఏడీ టవర్‌ను 47 అంతస్తులుగా నిర్మించనున్నారు. ఇందులోనే సీఎం ఆఫీస్ ఉంటుంది. జీఏడీ టవర్ టెర్రస్‌పై హెలిప్యాడ్ నిర్మించనున్నారు. మిగతా నాలుగు హెచ్‌ఓడీ టవర్లను 40 అంతస్తుల చొప్పున నిర్మించనున్నారు. ఇక ఈ డిజైన్ 60 వేల టన్నుల స్టీల్ అవసరమవుతుందని అంచనా.

## ఒంటిమిట్టలో నిత్యాన్నదాన పథకం



కడప, మార్చి 17, తిరుమల తరహాలోనే ఒంటిమిట్టలోనూ నిత్యాన్నదానం కార్యక్రమం ప్రారంభమైంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చేతుల మీదుగా సోమవారం నిత్యాన్నదానం కార్యక్రమం ప్రారంభమైంది. ఇకపై తిరుమల తరహాలోనే ఒంటిమిట్టలోనూ భక్తులకు నిత్యాన్నదానం అందుబాటులో ఉంటుంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నిత్యం మూడు పూటలా భక్తులకు అన్నదాన వితరణ జరుగుతుందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఒంటిమిట్ట రామాలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు తీపికబురు. తిరుమల తరహాలోనే ఒంటిమిట్టలోనూ నిత్యాన్నదానం కార్యక్రమం అందుబాటులోకి వచ్చింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు.. ఒంటిమిట్టలో నిత్యాన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. సోమవారం ఒంటిమిట్టలోని ఆలయాన్ని దర్శించుకున్న టీటీడీ ఛైర్మన్.. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానాల తరఫున నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఇకపై ఒంటిమిట్టలో భక్తులకు ప్రతిరోజూ మూడు పూటల అన్నప్రసాదాలు అందించనున్నారు. మరోవైపు ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 26వ తేదీ నుంచి ఏప్రిల్ ఐదో తేదీ వరకూ జరగనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.మరోవైపు ఒంటిమిట్ట లో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ పర్యవేక్షిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల పనులు వేగంగా జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీలోని అన్ని విభాగాలు, జిల్లా అధికారుల సమన్వయంతో పనులు చేపడుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మార్చి 24వ తేదీన ఒంటిమిట్ట రామాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. మార్చి 26వ తేదీన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది.బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం, సాయంత్రం వాహన సేవలు నిర్వహిస్తారు. మార్చి 27వ తేదీ నుంచి వాహన సేవలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాల వరకూ సీతారాముల కళ్యాణం జరగనుంది. సీతారాముల కళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో టీటీడీ విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది.మరోవైపు ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో మార్చి 25వ తేదీ ఉదయం పసుపు దంచే కార్యక్రమం నిర్వహించనున్నారు. మార్చి 27వ తేదీ నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ ఒకటో తేదీ అత్యంత వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం జరగనుంది. ఈ కళ్యాణోత్సవంలో ఈ పసుపును వినియోగించనున్నారు. ఇందుకోసం పసుపు దంచే కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ.

## చిన్నారి మృతదేహంతో బంధువుల రాస్తారోకో

విజయవాడ,బాపులపాడు మండలం వీరవల్లి వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించిన మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు , గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఘటన స్థలం వద్ద చిన్నారి మృతదేహాన్ని వుంచి ఆందోళన చేసారు. చిన్నారి మృతికి కారణమైన లారీ డ్రైవర్, ,లారీ యాజమాన్ని తక్షణమే అరెస్ట్ చేయాలని రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో చేసారు.

# తొలి దశలో 46 కిలోమీటర్ల వైజాగ్ మెట్రో

విశాఖపట్టణం, మార్చి 17, విశాఖ మెట్రో రైలు నిర్మాణంపై మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. విశాఖ మెట్రోకు త్వరలోనే కేంద్రం నుంచి అనుమతులు రానున్నట్లు తెలిపారు. 3 ఏళ్లలో వైజాగ్ మెట్రోను పూర్తి చేస్తామని తెలిపారు. తొలి దశలో 46.23 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. అదే సమయంలో విశాఖలో సెమీ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. అటు.. విజయవాడ మెట్రో నిర్మాణంపైనా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.ఆంధ్రప్రదేశ్ ఐటీ రాజధాని అయిన విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అంతర్జాతీయ కంపెనీలు విశాఖకు వస్తుండటంతో.. అందుకు తగ్గట్లు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన చేస్తోంది. అందులో భాగంగానే విశాఖలో మెట్రో, సెమీ రింగ్ రోడ్డు, నగర రోడ్లకు సంబంధించిన పనులపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి.. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం నుంచి విశాఖ మెట్రో ప్రాజెక్టుకు అనుమతులు రానున్నట్లు తెలిపారు.విశాఖపట్నం మెట్రో ప్రాజెక్ట్ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. విశాఖ మెట్రో ప్రాజెక్టుపై రైడర్స్ సంస్థ అధ్యయనం చేస్తోందని వివరించారు. ఆ సంస్థ అధ్యయనం 2 నెలల్లో పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే విశాఖ మెట్రో నిర్మాణం కోసం టెండర్లను పిలవనున్నట్లు వెల్లడించారు. 3 ఏళ్లల్లో వైజాగ్ మెట్రోను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. విశాఖలో పట్టణ, గృహ నిర్మాణ శాఖపై జరిగిన రీజినల్ వర్క్ షాప్‌లో పాల్గొన్న నారాయణ.. ఈ వ్యాఖ్యలు చేశారు.తొలి దశ విశాఖ మెట్రో నిర్మాణంలో భాగంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు మొత్తంగా 46.23 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఈ తొలి దశలో 3 కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు ఒక కారిడార్.. ఓల్డ్ పోస్టాఫీస్



నుంచి గురుద్వారా వరకు రెండో కారిడార్.. చినవాల్తేరు నుంచి తాటిచెట్లపాలెం వరకు మూడో కారిడార్ నిర్మించనున్నారు. ఈ 46.23 కిలోమీటర్ల మార్గంలో.. 20.16 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో రైలు మార్గాన్ని నిర్మించనున్నారు. అంటే దాదాపు సగం మార్గం డబుల్ డెక్కర్ విధానంలోనే ఉండనుంది.మరోవైపు.. విశాఖ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వగా.. డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)ను తయారు చేయడానికి కేంద్రం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో డీపీఆర్‌కు త్వరలోనే కేంద్రం నుంచి అనుమతులు రానున్నాయి. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా ఈ విశాఖ మెట్రో నిర్మాణాన్ని చేపట్టనున్నాయి.ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా కొంత మొత్తాన్ని కేటాయించేందుకు అంగీకరించింది. మరోవైపు.. విజయవాడ మెట్రోకు కూడా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన సంగతి తెలిసిందే. విజయవాడ మెట్రోకు త్వరలోనే సర్వే చేపట్టనుండగా.. ఆ తర్వాత డీపీఆర్‌ను తయారు చేసి ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు.మరోవైపు.. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లాగానే విశాఖపట్నంలో కూడా సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే విశాఖలో ట్రాఫిక్ భారీగా తగ్గతుందని పేర్కొన్నారు. సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి వీఎఆర్డీఏ అధ్యయనం చేస్తోందని.. విశాఖ అభివృద్ధి కోసం హడ్కో సహకారం ముఖ్యమని మంత్రి తెలిపారు. కార్పొరేషన్ల, మున్సిపాలిటీలకు ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను అన్వేషించనున్నట్లు పేర్కొన్నారు. రాంబిల్లి-భోగాపురం ప్రాజెక్టును వీఎంఆర్‌డీఏ పరిశీలిస్తోందని తెలిపిన మంత్రి నారాయణ.. మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఒక రోడ్డుకు అటవీ భూమి అడ్డుగా ఉందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లను కలిసి మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు.




# మాల్దీవ్స్ టు నెట్స్.. ఐపీఎల్ కోసం రంగంలోకి ముంబై దిగ్గజం..!



పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ కోసం రోహిత్ శర్మ సిద్ధమవుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మాల్దీవ్స్‌లో వెకేషన్‌లో సరదాగా గడిపిన రోహిత్.. స్వదేశం వస్తూనే నేరుగా ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు ముచ్చటించిన హిట్‌మ్యాన్.. కిట్ బ్యాగ్‌తో మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్.. ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఐపీఎల్‌లో రఫ్ఫాడించాలనే కసితో ఉన్నాడు.ఐపీఎల్ దిగ్గజ కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ మరో సీజన్‌కు రెఢీ అవుతున్నాడు. గత సీజన్‌లో దంచేసిన హిట్‌మ్యాన్ (15 మ్యాచుల్లో 418 పరుగులు) ఈసారీ శుభారంభాలు ఇవ్వాలనే కసితో ఉన్నాడు. మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిసిన రోహిత్ వెంటనే బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. శార్దూల్ ఠాకూర్, ఇతర ముంబై బౌలర్లను కాచుకున్న అతడు.. డిఫెన్స్, భారీ షాట్లు సాధన చేశాడు. అనంతరం సహచరులతో కలిసి ఫీల్డింగ్ చేశాడు.మొన్నటి వరకూ టీ20 ప్రపంచకకప్ అంబాసిడర్‌గా మైదానాల్లో సందడి చేసిన రోహిత్.. కాస్త బ్రేక్‌లో మాల్దీవ్స్‌లో కుటుంబంతో కలిసి సేదతీరాడు. ఐపీఎల్‌కు కౌంట్‌డౌన్ తన కెప్టెన్సీలో ముంబైని ఐదుసార్లు (2013, 2015, 2017, 2019, 2020) ముంబైని ఛాపియన్‌గా నిలిపిన రోహిత్.. గత రెండేళ్లుగా హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు.పంతొమ్మిదో సీజన్‌కు మరో పది రోజులే ఉండడంతో ఈ దిగ్గజ ఆటగాడు ప్రాక్టీస్ మొదలెట్టాడు. ఐపీఎల్ ఆరంభంలో దక్కన్ ఛార్జర్స్ తరఫున విజేతగా నిలిచిన రోహిత్.. ఆపై ముంబై ఇండియన్స్ గూటికి చేరాడు. అక్కడ రికీ పాంటింగ్ వారసుడిగా 2013లో సారథ్యం స్వీకరించిన ముంబైకర్ విజయవంతమైన నాయకుడిగా చరిత్రకెక్కాడు.

# టీ20 ప్రపంచకప్ 2026 విజేతను సత్కరించిన సీఎం రేవంత్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టైటిల్‌ను టీమిండియా గెలిచిన సంగతి తెలిసిందే. ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన భారత్ విశ్వ విజేతగా నిలిచింది. ఈ ఐసీసీ టోర్నీ అనంతరం వారి వారి స్వస్థలాలకు చేరుకున్న భారత క్రికెట్ జట్టు సభ్యులకు సత్కారాలు, అభినందనలు వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రపంచ కప్ 2026 విజేత జట్టులో సభ్యుడైన హైదరాబాద్ స్టార్ క్రికెటర్ తిలక్ వర్మ సీఎం రేవంత్ రెడ్డిని కలిశాడు. వరల్డ్ కప్ 2026 విజయానంతరం స్వస్థలానికి చేరుకున్న తిలక్.. సీఎంను మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా తిలక్‌ను సీఎం రేవంత్ సత్కరించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్‌తో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి పాల్గొన్నారు. అంతకముందు ముంబై నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న తిలక్ వర్మకు ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధికారులతో పాటు శాప్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, అభిమానులు తిలక్ వర్మకు స్వాగతం పలికారు. దీంతో శంషాబాద్ ఎయిర్ పోర్టు తిలక్ పేరుతో మార్మోగింది.

# ఐపీఎల్‌లో ఇంకా కలగానే ఆ ఆటగాళ్ల కోరిక!



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌అంటే క్రికెట్ ప్రియులకు పండగలాంటిది. ఈ లీగ్‌లో సెంచరీలు, హాఫ్ సెంచరీలు, వికెట్ల వేటలో ప్లేయర్లు దూసుకుపోతుంటారు. అలానే ప్రతి మ్యాచ్‌లో చక్కటి ప్రదర్శన చేసిన ఒకరికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కూడా ఇవ్వడం జరుగుతుంది. చాలా మంది ప్లేయర్లు వివిధ మ్యాచుల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను గెలుచుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే.. ఐపీఎల్ చరిత్రలో కొందరు స్టార్ ప్లేయర్లు ఒకే జట్టుపై దశాబ్ద కాలానికి పైగా ఆడుతున్నా.. నేటికీ ఆ జట్టుపై ఒక్కసారి కూడా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలవలేకపోవడం గమనార్హం. ఐపీఎల్ 2026 సీజన్ ఈ నెల 28న ప్రారంభం కానున్న తరుణంలో ఈ అంశం తెరపైకి వచ్చింది. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...రికార్డుల రారాజు, టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీకి ఒక జట్టుపై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. రాజస్థాన్ రాయల్స్‌తో 33 మ్యాచ్‌ల్లో కోహ్లీ ఎన్నో పరుగులు చేసినప్పటికీ, ఆ జట్టుపై ఒక్కసారి కూడా ఈ అవార్డును అందుకోలేకపోయాడు. అలానే చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా ముంబై ఇండియన్స్‌పై ఏకంగా 37 మ్యాచ్‌లు ఆడినప్పటికీ, ఇప్పటివరకు ఒక్కసారి కూడా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకోలేదు. అలానే టీమిండియా క్రికెటర్ దినేశ్ కార్తీక్.. ఇప్పటివరకు చెన్నైపై 33 మ్యాచ్‌లు ఆడినప్పటికీ ఒక్క అవార్డు కూడా సాధించలేకపోయాడు. అలానే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై కూడా కార్తీక్ ఈ అవార్డును గెలవలేకపోయాడు.కేకేఆర్ జట్టుపై భువనేశ్వర్ కుమార్ ఎన్నో కీలక వికెట్లు పడగొట్టాడు. కానీ, ఆ జట్టుతో తలపడిన 30 మ్యాచ్‌ల్లో ఒక్కసారి కూడా అతణ్ని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించలేదు. మాజీ ప్లేయర్ రాబిన్ ఉతప్ప ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుపై తన కెరీర్‌లో 28 మ్యాచ్‌లు ఆడాడు. అయితే ఢిల్లీపై అతడు ఒక్కసారీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకోలేదు. మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ ఎందరో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టినప్పటికీ, సన్ రైజర్స్ హైదరాబాద్‌పై ఆడిన 27 మ్యాచ్‌ల్లో ఈ అవార్డును అందుకోలేపోవడం విశేషం. అలానే ఇంకా చాలా మంది ప్లేయర్లు కొన్ని జట్లపై ఎన్నో మ్యాచులు ఆడినప్పటికీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను గెలవలేకపోయారు. ఈ క్రమంలో ఐపీఎల్ నుంచి కొందరు ప్లేయర్లు రిటైర్ కాగా.. మరికొందరు కొనసాగుతున్నారు. ఐపీఎల్ 2026లోనైనా ఈ ఆటగాళ్లు ఈ రికార్డులను చెరిపివేస్తారో లేదో చూడాలి.

# ఆస్పత్రిపై దాడి యుద్ధ నేరమే: రషీద్ ఖాన్



బాగ్దాద్: ఆఫ్ఘనిస్తాన్‌లో ఓ డ్రగ్స్ చికిత్సాలయంపై సోమవారం రాత్రి పాకిస్థాన్ ఆకస్మిక దాడి చేసింది. ఆ దాడి వల్ల కాబూల్‌లోని ఆస్పత్రిలో 400 మంది మృతిచెందగా, మరో 250 మంది గాయపడ్డారు. డ్రగ్ రిహాబిలిటేషన్ ఆస్పత్రిపై రాత్రి 9 గంటలకు దాడి జరిగినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్‌దుల్లా ఫిత్రత్ తెలిపారు. అయితే ఈ ఘటన పట్ల ఆఫ్ఘన్ క్రికెటర్ రహీద్ ఖాన్ స్పందించారు. పాక్ మిలిటరీ చర్యను ఆయన ఖండించారు. పాకిస్థాన్ వైమానిక దాడుల వల్లే ప్రాణనష్టం జరిగినట్లు ఆ క్రికెటర్ చెప్పారు. పవిత్రమైన రంజాన్ మాసం సమయంలో ఈ దాడి జరగడం దారుణమన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రషీద్ ఖాన్ రియాక్ట్ అయ్యారు.సాధారణ పౌరులు చనిపోవడం బాధగా ఉన్నట్లు చెప్పారు. ఇండ్లను, విద్యా సంస్థలను, వైద్య కేంద్రాలను కావాలని లేదా అనుకోకుండా అటాక్ చేసినా అది యుద్ధ నేరమే అవుతుందని రషీద్ పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసం వేళ మనుషుల ప్రాణాలు విలువ ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా కలచివేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల వైరం, ద్వేషం పెరుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర మానవ హక్కుల సంఘాలు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టాలని కోరారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కష్ట సమయంలో ఆఫ్ఘన్ ప్రజలకు అండగా ఉండనున్నట్లు చెప్పారు.

# అందుకే సీఎస్కేకి వచ్చా.. రాజస్థాన్ రాయల్స్‌ను వీడటంపై సంజు శాంసన్ రియాక్షన్

అయితే టీమిండియా స్టార్ క్రికెటర్ సంజు శాంసన్ ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున బరిలోకి దిగనున్నాడు. ట్రేడ్ డీల్ ద్వారా జడేజాను రాజస్థాన్ రాయల్స్‌కు పంపి.. సంజుని సీఎస్కే జట్టులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై సంజు శాంసన్ ఎట్టకేలకు స్పందించాడు. జట్టు ఎందుకు మారాల్సి వచ్చిందనే దానిపై స్పష్టతనిచ్చాడు.'రాజస్థాన్ రాయల్స్ జట్టులో నా సమయం ముగిసిందని భావించా.. అందుకే ఆ జట్టు నుంచి బయటకు వచ్చా. నేను ఆర్ఆర్‌కు ప్రత్యర్థిగా ఆడటం ఇదే మొదటిసారి. ఇలాంటి పరిస్థితి ఇప్పటి వరకు రాలేదు. అయితే నేను ఒక్కసారి మైదానంలోకి వచ్చాక మ్యాచ్ గురించి తప్ప ఇంకేమీ ఆలోచించను. రాజస్థాన్ జట్టులో చాలా మంది ఆటగాళ్లతో కలిసి నేను ఆడాను. మేనేజ్‌మెంట్, సపోర్ట్ స్టాఫ్ అంతా తెలిసిన వాళ్లే. వారు నా పట్ల ఎంతో ప్రేమ చూపిస్తారు. కానీ ప్రతి ఒక్కరికీ ఓ సమయం అనేది ఉంటుంది. ఆర్ఆర్‌తో నా సమయం ముగిసింది. నేను ముందుకుసాగాను. ఇది నాకు కొత్త ప్రయాణం. ప్రస్తుతం నేను రాజస్థాన్ రాయల్స్‌పై కూడా చాలా ఆనందంగా ఆడాలనుకుంటున్నా' అని సంజు వెల్లడించాడు.




# బెల్జియం క్రికెట్ లీగ్.. ఆ క్రికెట్ జట్టుకు సహ యాజమానిగా జహీర్ ఖాన్

యూరప్ క్రికెట్ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. టీమిండియా మాజీ క్రికెటర్ జహీర్ ఖాన్.. ఈయూటీ20 బెల్జియం క్రికెట్ లీగ్‌లో భాగమయ్యాడు. ఆంట్వెర్ప్ యాంకర్స్ జట్టుకు సహ యజమానిగా చేరాడు. ఈ విషయాన్ని ఆ ఫ్రాంచైజీ ధ్రువీకరించింది. కాగా ఈ క్రికెట్ లీగ్ జూన్ 4 నుంచి 14 వరకు బ్రస్సెల్స్‌లో జరగనుంది. ప్లేయర్‌గా భారత్‌కు విశేష సేవలందించిన జహీర్.. ఇప్పుడు యూరప్‌లో క్రికెట్‌ను విస్తరించాలనే లక్ష్యంతో ఈ బాధ్యతలు చేపట్టాడు'యూరప్ క్రికెట్ ఒక పెద్ద వేదిక. ఇక్కడ సాధ్యమయ్యే వాటికి ఇది కేవలం ఆరంభం మాత్రమేనని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. ఆంట్వెర్ప్ యాంకర్స్ జట్టుకు సహ యజమానిగా ఉండటం కేవలం ఓ వ్యాపార ప్రతిపాదన మాత్రమే కాదు. ఆటగాళ్లలోని ప్రతిభను కనుగొని, వారు పూర్తి సామర్థ్యంతో రాణించడానికి అవసరమైన



వేదికను అందించడమే నా లక్ష్యం. జూన్‌లో బ్రస్సెల్స్‌లో ఉండి పనులు ప్రారంభించడానికి నేను ఎదురుచూస్తున్నాను' అని జహీర్ ఖాన్ అన్నాడు.'జహీర్ ఖాన్ వంటి లెజెండ్ మా జట్టులో భాగం అవ్వడం గొప్ప విషయం. ఆంట్వెర్ప్ యాంకర్స్ జట్టు అతడి వల్ల ప్రత్యేకంగా నిలుస్తుంది. క్రికెట్‌లో జహీర్ ఖాన్ ఓ దిగ్గజం, విజేత. అతడి భాగస్వామ్యం ఫ్రాంచైజీ, యూరోపియన్ క్రికెట్ సమాజం అభివృద్ధికి కీలకం కానుంది' అని ఆంట్వెర్ప్ యాంకర్స్ యజమాని నాగేంద్ర సిద్దొతమ్ అన్నాడు.



# సినిమా



# రాజ్ కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ

## ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వంలో రఫ్తార్



బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్'. ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనురాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# పవన్ స్ఫూర్తితో బుచ్చిబాబు దర్శక ప్రయాణం!

ప్రతి దర్శకుడికి ఒక గురువు, స్ఫూర్తి ఉంటారు. బుచ్చిబాబుకు దర్శకత్వ మెళకువలు నేర్పిన గురువు డైరెక్టర్ సుకు మార్ అయితే, అసలు తనలో ఒక దర్శకుడు కావాలనే బలమైన కోరికను, స్ఫూర్తిని నింపింది మాత్రం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అని తాజాగా వెలుగులోకి వచ్చింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్ వేడుకలో భాగంగా ఈ విషయాన్ని బుచ్చిబాబు తెలిపారు. అంటే బుచ్చిబాబు దర్శకత్వ ప్రయాణం కాకినాడ వీధుల్లోనే మొదలైందని చెప్పాలి. ఆయన అక్కడ ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే పవన్ కళ్యాణ్ నటించిన 'తొలిప్రేమ' చిత్రం విడుదలై సంచలనం సృష్టించింది.ఆ సమయంలో బుచ్చిబాబు స్నేహితుడు ఒకరు తొలి ప్రేమ సినిమా చూసి , అందులోని సన్నివేశాలను, పవన్ కళ్యాణ్ మేనరిజమ్స్‌ను వివరిస్తూ పూర్తిగా మైమరిచిపోయారట. తన స్నేహితుడిలో ఆ సినిమా కలిగించిన ఇంపాక్ట్ చూసి బుచ్చిబాబు ఆశ్చర్యపోయారు. ఒక సినిమా మనిషిని ఇంతలా ప్రభావితం చేయగలదా? అని ఆలోచించిన బుచ్చిబాబుకు అప్పుడే తాను కూడా దర్శకుడు కావాలనే ఆలోచనకు బీజం పడింది. అలా పవన్ కళ్యాణ్ 'తొలిప్రేమ' సినిమా బుచ్చిబాబు జీవితాన్ని మలుపు తిప్పిందని చెప్పొచ్చు. ఇప్పటి వరకూ బుచ్చిబాబు పరిశ్రమకు రావడానికి కారణం అంతా సుకుమార్ అనుకుంటున్నారు. ఈ చిత్రమైనా బాలీవుడ్ లో పునాది వేస్తుందా? సుకుమార్ బుచ్చిబాబుకు లెక్కలు చెప్పిన గురువు కావడంతో? సుకుమార్ పరిశ్రమలో పెద్ద దర్శకుడు కావడంతో తాను కూడా గురువు లాగే దర్శకుడు అవ్వాలనుకుని వచ్చారని అనుకున్నారంతా. కానీ బుచ్చిబా తాజా వివరణతో క్లారిటీ వచ్చేసింది. ఆ రకంగా సుకుమార్ డైరెక్టర్ గా గురువు అయితే? దర్శకుడు అవ్వాలనే ఆలోచనకు పవన్ స్ఫూర్తిగా నిలిచారు. అలా బుచ్చిబాబు సుకుమార్ వద్ద శిష్యరికం మొదలైంది. బుచ్చిబాబు తొలి సినిమా 'ఉప్పెన' ఎలాంటి విజయం సాధించిందో తెలిసిందే. తన మేకింగ్‌లో



గురువు సుకుమార్ మార్క్ చూపిస్తున్నారు.బుచ్చిబాబు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో తన తదుపరి చిత్రాన్ని 'పెద్ది'ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. రామ్ చరణ్ అంటే పవన్ కి కుమారుడు. ఆ రకంగా మెగా కాంపౌండ్ లో కి బుచ్చిబాబు రెండవ సినిమాతోనే ఎంటర్ అయ్యారు. ఇప్పుడు ఏకంగా పవన్ ముందు మైక్ పట్టుకుని మాట్లాడారు. మరి భవిష్యత్ లో తనలో స్ఫూర్తిని నింపిన పవన్ ని బుచ్చిబాబు డైరెక్ట్ చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. 'పెద్ది' భారీ విజయం సాధిస్తే బుచ్చిబాబు తర్వాత సినిమా పవన్ కళ్యాన్ తో ఉన్నా? సర్ ప్రైజ్ అవ్వొద్దు సుమీ. ఎందుకంటే బుచ్చిబాబు తదుపరి చిత్రం ఇంకా ఏ హీరోతోనూ లాక్ అవ్వలేదు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో ఉంటుందనే వార్త తప్ప అందులో నిజం లేదు. 'పెద్ది' రిలీజ్ అనంతరం బుచ్చిబాబు మూడవ సినిమా హీరో ఎవరు? అన్నది కన్ఫమ్ అవుతుంది.

# మోనాలిసా పెళ్లి.. ఏకంగా సీఎంని కలుస్తానంటున్న డైరెక్టర్!



ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేసిన 'వైరల్ గర్ల్' మోనాలీసా భోంస్లే పెళ్లి ఇప్పుడు పెద్ద దుమారాన్నే రేపుతోంది. ఒక ముస్లిం వ్యక్తిని ఆమె వివాహం చేసుకోవడం కేవలం వ్యక్తిగతం కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందంటూ దర్శకుడు సనోజ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా 'లవ్ జిహాద్' అని ఆరోపిస్తూ ఏకంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తాననడం ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. ఆ వివరాలేంటో చూద్దాం. కుంభమేళా వైరల్ గర్ల్ నుంచి వివాదం వరకు: ప్రయాగ్‌రాజ్ కుంభమేళా అనగానే ఆధ్యాత్మికత గుర్తుకు వస్తుంది. కానీ గతేడాది అక్కడ మోనాలీసా భోంస్లే ఫోటోలు, వీడియోలు వైరల్ కావడంతో ఆమె ఒక్కసారిగా సెలబ్రిటీ అయిపోయింది. ఆ పాపులారిటీతో సినిమా అవకాశాలు కూడా దక్కించుకుంది. అయితే, తాజాగా ఆమె ఒక ముస్లిం యువకుడిని పెళ్లి చేసుకోవడం చర్చకు దారితీసింది. ఆధ్యాత్మిక వేదికపై గుర్తింపు తెచ్చుకున్న యువతి ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనికి తోడు సినీ ప్రముఖులు కూడా స్పందించడంతో ఇష్యూ సీరియస్ అయింది.డైరెక్టర్ సనోజ్ మిశ్రా సంచలన ఆరోపణలు: ప్రముఖ చిత్ర దర్శకుడు సనోజ్ మిశ్రా ఈ వివాదంలోకి ప్రవేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఖర్గోన్‌లో మోనాలీసా కుటుంబాన్ని కలిసిన ఆయన, ఈ పెళ్లి వెనుక మతమార్పిడి కోణం ఉందని ఆరోపించారు. ఇక హిందూ మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రలోభాలకు గురిచేస్తున్నారని, మోనాలీసా పెళ్లి కూడా అందులో భాగమేనని ఆయన పేర్కొన్నారు. ఇది ఖచ్చితంగా 'లవ్ జిహాద్' అని, దీనిపై లోతైన విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఒక సినీ దర్శకుడు ఇలా నేరుగా ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం: ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలేసే ప్రసక్తే లేదని సనోజ్ మిశ్రా స్పష్టం చేశారు. త్వరలోనే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను కలిసి పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరనున్నారు. ఇక ఇప్పటికే ఈ విషయంపై రాజకీయ రంగు పులుముకుంది. అటు సోషల్ మీడియాలో కూడా మోనాలీసా నిర్ణయాన్ని సమర్థించేవారు, వ్యతిరేకించేవారి మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో అన్నది ఉత్కంఠగా మారింది. ప్రస్తుతానికి మోనాలీసా భోంస్లే పెళ్లి వ్యవహారం కేవలం ఒక వివాహానికి పరిమితం కాకుండా సామాజిక, రాజకీయ చర్చగా మారింది. ఇక ఒకవైపు ఇది ఆమె వ్యక్తిగత ఇష్టమని కొందరు అంటుంటే, మరోవైపు దీని వెనుక గూడుపుఠాణి ఉందనేది దర్శకుడి వాదన. ఏది ఏమైనా, కుంభమేళాలో వెలుగులోకి వచ్చిన ఈ 'వైరల్ గర్ల్' జీవితం ఇప్పుడు కోర్టులు, ఫిర్యాదుల వరకు వెళ్లేలా కనిపిస్తోంది. మరి ఈ వివాదం ముమ్ముందు ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.




# నవ్వినా లిప్‌స్టిక్ తుడిచినా ట్రోలింగే!

అలియా భట్ నేడు గ్లోబల్ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న నటి. బాలీవుడ్ నవతరం నటీమణుల్లో అత్యంత వేగంగా పరిశ్రమలో ఎదిగిన నటిగానూ ఆమెకు గుర్తింపు ఉంది. ఎంతో ప్రతిభావంతురాలు కూడా. చిన్న వయసులో? ఎంత మాత్రం ప్రయోగాలకు వెనుకాడకుండా పని చేస్తోంది. అయితే అమ్మడు ఎంతగా ఎదుగుతుందో? అంతకంతకు సోషల్ మీడియాలో సొగసరిపై ట్రోలింగ్ కూడా పెరుగుతోంది. తాజాగా బాఫ్టా వేడుకలో ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు , గతంలో తన భర్త రణబీర్ కపూర్ గురించి చెప్పిన విషయాలను నెటిజన్లు మరోసారి తెరపైకి తెస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఎలా మాట్లాడినా అందులో తప్పులు వెతకడమే పనిగా పెట్టుకున్న కొందరు నెటిజన్ల తీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా బాఫ్టా వేడుకలో 'గాన్ గర్ల్' సినిమాలోని ఒక ప్రసిద్ధ మోనోలాగ్ గురించి ప్రస్తావించినప్పుడు? అలియా ఒక క్షణం తడబడటాన్ని కొందరు నెటిజన్లు ఓ నేరంగా చిత్రీకరిస్తున్నారు. దశాబ్దం క్రితం వచ్చిన సినిమాలోని సంభాషణలను అప్పటికప్పుడు గుర్తు తెచ్చుకోలేకపోవడం సహజమని విశ్లేషకులు చెబుతున్నా? ట్రోలర్లు మాత్రం ఆమెను టార్గెట్ చేయడం ఆపడం లేదు. ఈ చిత్రమైనా బాలీవుడ్ లో పునాది వేస్తుందా? ఒక అంతర్జాతీయ వేదికపై భారతీయ నటిగా ఆమె సాధించిన ఘనతను పక్కన పెట్టి ఇలాంటి చిన్న విషయాలను భూతద్దంలో చూపడం వారి అసూయకు నిదర్శనమని అభిమానులు మండిపడుతున్నారు. అలాగే రణబీర్ కపూర్ విషయంలో కూడా అలియాను నెటిజన్లు విడిచి పెట్టలేదు. ఓ ఇంటర్వ్యూలో రణబీర్‌కు తన సహజమైన పెదవుల రంగు అంటేనే ఇష్టమని? అందుకే లిప్‌స్టిక్ తుడుచుకోమని చెబుతుంటారని ఆమె సరదాగా పంచుకున్నారు. దీనిని పట్టుకుని రణబీర్‌ను ఒక రెడ్ ఫ్లాగ్ అని ఆయన ఆమెను నియంత్రిస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. భార్యాభర్తల మధ్య ఉండే వ్యక్తిగత ఇష్టాయిష్టాలను కూడా సామాజిక సమస్యగా మార్చడం ఎంత వరకు సమంజసం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేవలం మాటల మీదనే కాకుండా? అలియా చేసే సామాజిక స్పృహ కలిగిన పనుల మీద కూడా విమర్శలు వస్తున్నాయి. మకర సంక్రాంతి సమయంలో పక్షుల సంరక్షణ గురించి ఆమె చేసిన పోస్ట్‌ను కపటత్వంగా కొందరు అభివర్ణించారు. ఆమె లెదర్ బ్రాండ్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నప్పుడు జంతువుల గురించి మాట్లాడే హక్కు లేదంటూ విమర్శించారు. ఒక నటిగా ఆమె చేసే వృత్తిని, ఒక వ్యక్తిగా ఆమెకు ఉండే సామాజిక బాధ్యతను వేరు చేసి చూడలేకపోవడం కొందరి సంకుచిత స్వభావానికి అద్దం పడుతోంది.





Edited, Printed, Published and Owned by KASHAPAGA SAHITYA, and Printed at THANMAYEE PRINTERS, D.No. 17-2-539,Shop No.7&8,Saidabad,Hyderabad,Telangana and Published at: H.No. 18-7-731, Gowlipura, Chatrinaka, Hyderabad-500053, Telangana.Editor: KASHAPAGA SAHITYA. “RNI No.TELTEL/2015/64243. Cell:7671859219 E-mail Id: iyyalatelangana@gmail.com